# ఉద్యమ కెరటం

www.udyamakeratam.com

నిజం.. రక్షతి రక్షితః

తెలుగు దినపత్రిక

UDYAMA KERATAM TELUGU DAILY



www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

రిపోర్టర్లు కావలెను

ఉద్యమ కెరటం దిన పత్రిక లో పని చేయుటకు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ, మండల రిపోర్టర్లు కావలెను.

మీ ప్రాంతాలకు సంబంధించిన రాజకీయాలు, సామాజిక, ఇతర అంశాల పై లోతైన విశ్లేషణలు, రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు ఈ క్రింది నెంబర్, ఈ-మెయిల్‌కు తమ బయోడేటాను పంపగలరు.

సెల్: 9030717172

E-mail: udyamakeratamtelugudaily@gmail.com



12.2.2025 బుధవారం Wednesday | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 277 | పేజీలు : 11 Pages : 11 | వెల: 5 RNI: TELTEL12329 | Published from : Asifabad, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy




02

## పాతబస్తీలో మెట్రో విస్తరణ ఆపాలి

పురాతన కట్టడాలకు ప్రమాదమంటూ వ్యాజ్యం 17కు విచారణ వాయిదా వేసిన హైకోర్టు



# మంచి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం

- ఎలాంటి న్యాయపర చిక్కులు రావద్దనేదే ప్రభుత్వ ఆలోచన
- కేబినెట్‌సబ్‌కమిటీని నియమించి, న్యాయ కమిషన్‌ఏర్పాటు చేశాం
- మందకృష్ణ, మాదిగ ఉపకులాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

### రాజకీయాలకు అతీతంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ, మాదిగ ఉపకులాల ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు ఎలాంటి

మిగతా 2 లో

02

## కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా..

### మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం 8మంది హైదరాబాద్‌వాసుల దుర్మరణం

- మినీ బస్సును ఢీకొట్టిన లారీ..
- సీఎం సంతాపం



వారంతా హైదరాబాద్ నుంచి దాదాపు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించి ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు వెళ్లారు. అక్కడ పుణ్యస్నానాలు ఆచరించి ఇంటికి వెనుదిరిగారు. కానీ మార్గమధ్యలోనే మృత్యువు లారీ రూపంలో వారిని కబళించింది. ఉదయం 8 గంటలు. మధ్యప్రదేశ్ జబల్‌పుర్‌లోని సిహెూరా ప్రాంతం. హైవే వంతెనపైకి రాంగ్‌రూటులో వచ్చిన సిమెంట్ లోడ్ లారీ ఎదురుగా వస్తున్న మినీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ బస్సు తుక్కుతుక్కుగా మారి ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు దాంట్లో ఇరుక్కుపోయారు. ప్రమాదంలో నాచారానికి చెందిన శశికాంత్, మల్లారెడ్డి, రవిప్రకాశ్, సంతోష్‌కుమార్, డ్రైవర్ రాజుతో పాటు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఆనంద్, తార్నాక వాసి టీవీప్రసాద్ అనే ఈ ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరోకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

మిగతా 2 లో



03

## కులగణనలో పాల్గొని వారు బీసీలపై ప్రేమనా?

## రాష్ట్రంలో ఇసుక అందుబాటులో ఉండాలి

- రెవెన్యూ, పోలీస్ శాఖలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి
- సచివాలయంలో మైనింగ్ అధికారులతో సీఎస్ శాంతి కుమారి సమీక్ష



02



## పార్లమెంటులో మరో ఆరు భాషలకు అనువాదం

- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వెల్లడి

02

## రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదు..


- అర్చకుడిపై దాడి అమానవీయ చర్య
- మంత్రి శ్రీధర్ బాబు వార్నింగ్

02



## మెడికల్ పీజీలో స్థానిక కోటా వ్యవహారం

- హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- విచారణ చేపడతామన్న ధర్మసనం.. కేసు ఏప్రిల్ 4కు వాయిదా




02

## రైతుల కోసం ఎంతటి పోరాటాలైనా సిద్ధం

- రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



03

## లోపాయికారి ఒప్పందమేమి లేదు!

- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో పోటీలో లేము
- అందుకే ఎన్నికలకు దూరం
- బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నారు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్

03



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా



**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ జిల్లా పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిహోరా పట్టణ శివారులో రాంగ్ రూట్లో వస్తున్న లారీ మినీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. హైదరాబాద్ కు చెందిన ఏడుగురు అక్కడకక్కడే మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించి స్థానికులు బస్సులో చిక్కుకుపోయిన వారికి కాపాడి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, హైదరాబాద్ లోని నాచారం నుంచి కొంతమంది భక్తులు ప్రయాగ లో జరుగుతోన్న కుంభమేళాకు మినీ బస్సులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బజల్పూర్ జిల్లా కేంద్రానికి 65 కి.మీ. దూరంలో ఉన్న సిహెూరా పట్టణ శివారులో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయి-నట్లు తెలుస్తుంది. మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు ఆరుగురు ఒకే కుటుంబానికి చెందినవారుగా భావిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకునన్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదానికి గురైన బస్సు రిజిస్టేషన్ ఆధారంగా ప్రమాదానికి గురైన వారు ఏపీకి కి చెందిన వారు అనుకున్నారు, కానీ మృతదేహాల వద్ద దొరికిన ఆధారాలతో మృతులంతా హైదరాబాద్ నగరంలోని నాచారం వాసులుగా, సాఫ్ట్వేర్ ఉద్యోగి శశికాంత్ కుటుంబసభ్యులుగా పోలీసులు గుర్తించారు. మృతులు నాచారంలోని కార్తికేయ నగర్, రాఘవేంద్రనగర్ వాసులుగా తెలుస్తోంది. మృతులు నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్, మల్లారెడ్డిలుగా గుర్తించారు. మొత్తం మూడు బస్సుల్లో కుంభమేళాకు యాత్రికులు వెళ్లారు. ప్రమాదానికి గురైన బస్సు నెం. ఏపీ29డబ్ల్యూ1525గా గుర్తించారు. ప్రమాద సమయంలో మినీ బస్సులో మొత్తం 14మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వీరంతా ఒకే వాహనంలో వెళ్లారు. ఘోర ప్రమాదంతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా సమయంలో మినీ బస్సు వెనుకగా వచ్చిన తెలంగాణకు సంబంధించిన కారు సైతం ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

## సీఎం, కిషన్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి

రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటెల రాజేందర్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు మృతదేహాలను త్వరగా హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఘటనపై రంగారెడ్డి కలెక్టర్ జబల్‌పూర్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను కూడా ఫోన్‌లో పరామర్శించారు. మేడ్చల్ అదనపు కలెక్టర్ సైతం బాధిత కుటుంబీకులతో మాట్లాడారు.



# పాతబస్తీలో మెట్రో విస్తరణ ఆపాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** మెట్రో రైలు విస్తరణపై తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పాతబస్తీలో మెట్రో విస్తరణ వల్ల పురాతన కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూఎఫ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. తెలంగాణ సీఎస్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, మెట్రో రైలు ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై ఏపీడబ్ల్యూఎఫ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పలు చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్-2017 ప్రకారం చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సి ఉందని.. పాతబస్తీలో మెట్రోమార్గం సమీపాన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణాహవేలీ, మొఘల్‌పుర సమాధుల వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని వివరించింది. మెట్రోరైలు నిర్మాణం వల్ల ఆ కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. మెట్రో డిజైన్‌ను హైకోర్టు లేదా నిపుణుల బృందం ఆమోదించిన తర్వాత ముందుకు వెళ్లాలని కోరింది. అప్పటి వరకు మెట్రో నిర్మాణ పనులు నిలిపివేయాలని హైకోర్టుకు ఏపీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది.

# పార్లమెంటులో మరో ఆరు భాషలకు అనువాదం

### లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** బోడో, డోగ్రీ, మైథిలి, మణిపురి, ఉర్దూ, సంస్కృతంతో సహా ఆరు కొత్త భాషలకు అనువాద సేవలను పొడిగిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం హిందీ, ఇంగ్లీషుతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు వంటి ఈ పది భాషల్లో అనువాద సేవలు పార్లమెంటులో అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటుగా తాజాగా మరో కొత్త ఆరు భాషలు బోడో, డోగ్రీ, మైథిలీ, మణిపురి, ఉర్దూ, సంస్కృతంలను అనువాద సేవల్లోకి చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు. మానవ వనరులు అందుబాటులోకి వచ్చినందున అదనంగా 16 భాషలను ఏకకాలంలో అనువాదాలను అందించడానికి తాము ప్రయత్నిస్తున్నామని స్పీకర్ ఈ సందర్భంగా చెప్పారు. కాగా, 'భారత పార్లమెంట్ వ్యవస్థ అనేది ప్రజాస్వామ్యం ఆధారంగా ఉంటుంది. అందువల్ల చాలా భాషలలో అనువాదాలను అందించే అవకాశం ఉంది. భారతదేశంలో 22 భాషల్లో ఈ ప్రయత్నం చేస్తున్నామని నేను ప్రపంచస్థాయి వేదికలపై మాట్లాడినప్పుడు అందరూ నన్ను ప్రశంసించారు. అధికారికంగా గుర్తింపు పొందిన 22 భాషల ఉనికిని కాపాడడమే లక్ష్యంగా పెట్టుకున్నామని' స్పీకర్ చెప్పారు. అయితే స్పీకర్ ప్రకటనపై డిఎంకె ఎంపి దయానిధి మారన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. '2011 సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 73 వేల మందే సంస్కృతం మాట్లాడుతున్నారు. మీ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాల వల్ల పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఎందుకు వృథా చేస్తారు?' అని మారన్ వాదించారు. మారన్ వ్యాఖ్యలపై లోక్‌సభ స్పీకర్ స్పందించారు. మీరు ఏ దేశంలో నివశిస్తున్నారు అని దయానిధి మారన్‌ను తిరిగి స్పీకర్ ప్రశ్నించారు. ఇది భారతదేశం. ఈ దేశం మూల భాష సంస్కృతం. అందుకే మేము సంస్కృతం మాత్రమే కాకుండా 22 భాషలను ప్రస్తావించాము. ఇన్ని భాషలతో కాకుండా.. మీకు కేవలం సంస్కృతంతోనే ఎందుకు సమస్య వచ్చింది? అని స్పీకర్ మారన్‌ని ప్రశ్నించారు.

# మెడికల్ పీజీలో స్థానిక కోటా వ్యవహారం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటాపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అందుకు సుప్రీం కోర్టు ధర్మాసనం అనుమతించింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ ఇటీవల జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తమ పిటీషన్‌పై విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. దాంతో విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటే.. ముందు తాము విచారణ చేపడతామని జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ క్రమంలో తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 371(డి) అనుసరించి.. ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకూ పీజీలో స్థానికత కోటాలో సీట్లు కేటాయించాలంటూ దాదాపు 100 మంది జూనియర్ వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా వర్తిస్తుందని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఇక విభజన అనంతరం ఆర్టికల్ 371(డి) పదేళ్ల పాటు మాత్రమే వర్తింపజేయాలన్న నిబంధన ఉందన్న తెలంగాణ వాదనను తెలంగాణ హైకోర్టు ఈ సందర్భంగా పరిగణలోకి తీసుకోలేదు. అదీకాక 9 వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే స్థానికత కోటా వర్తిస్తుందని ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రీజియన్‌లో మాత్రమే చదివిన వారికి ఈ స్థానికత వర్తిస్తుందని తెలంగాణ ప్రభుత్వం సైతం వాదించింది. ఇక ఆర్టికల్ 371(డి) ప్రకారం రాయలసీమ, ఆంధ్ర ప్రాంతంలో సైతం ఎంబీబీఎస్ చదివిన వారు కూడా తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా కింద అర్హులేనంటూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 371(డి) ఉమ్మడి ఆంధప్రదేశ్‌కి వర్తిస్తున్నందు వల్ల అందులో సవరణలు చేసేంత వరకూ ఏపీ, రాయలసీమలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులూ తెలంగాణలో స్థానిక కోటాకు అర్హులేనని స్థానిక హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో సుమారు 200 మంది విద్యార్థులకు అడ్మిషన్లు లభించనున్నాయి. దీంతో హైకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఇక పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునూ తెలంగాణకు వర్తింప జేయకూడదని రేవంత్ రెడ్డి సర్కార్‌ను కోరింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానికత చెల్లదంటూ త్రిసభ్య దర్మాసనం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం తాము దాఖలు చేసిన పిటీషన్‌ను సైతం విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. అయితే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసే ముందు తాము విచారణ చేపడతామంటూ ఏప్రిల్ 4వ తేదీకి తదుపరి విచారణను జస్టిస్ బిఆర్ గవాయ్ ధర్మాసనం వాయిదా వేసింది.

# మంచి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం

మొదటి పేజీ తరువాయి

న్యాయ పరమైన చిక్కులు ఎదురు కావొద్దన్న ఆలోచనతో ప్రక్రియను చట్టబద్ధంగా ముందుకు తీసుకువెళ్లామని, అందులో భాగంగానే తొలుత అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీని నియమించడంతో పాటు న్యాయ కమిషన్ ఏర్పాటు చేశామని వివరించారు. సాధ్యమైనంత తొందరగా సదరు నివేదికలను తెప్పించి, కమిషన్ సిఫార్సులను కేబినెట్ లో, ఆ తర్వాత అసెంబ్లీలో ఆమోదించామని సీఎం గారు గుర్తుచేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని మంద కృష్ణ ఈ సందర్భంగా అభినందించారు. వర్గీకరణ ప్రక్రియను ఒక నిబద్ధతతో చేపట్టిన ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక సోదరుడిగా అండగా ఉంటానని మందకృష్ణ తెలిపారు. కాగా, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ భేటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాదిగ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఏ, బీ, సీ, డీ గానే వర్గీకరణ చేపట్టాలి

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌తో ఆయన భేటీ అయ్యారు. వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించారని కృతజ్ఞతలు తెలిపారు. అయితే కొన్ని లోపాలు ఉన్నాయంటూ ఆయన సీఎం దృష్టికి తీసుకుని వెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. 'సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. అందుకే వారికి ధన్యవాదాలు తెలిపాం. అయితే, జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలో కొన్ని లోపాలున్నాయి. ఎస్సీలను 1, 2, 3 గ్రూపులుగా కాకుండా ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలి. నివేదికలో ఉన్న లోటుపాట్లను సరి చేస్తారని ఆశిస్తున్నాం'.. అని మందకృష్ణ అన్నారు.

# రాష్ట్రంలో ఇసుక అందుబాటులో ఉండాలి


- రెవెన్యూ, పోలీస్ శాఖలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి
- సచివాలయంలో మైనింగ్ అధికారులతో సీఎస్ శాంతి కుమారి సమీక్ష



**హైదరాబాద్,ఫిబ్రవరి11 :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా, ఇసుక అక్రమాల నిరోధంపై సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. రాష్ట్రంలో ఇసుక లబ్దిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం తెలంగాణ సచివాలయంలో మైనింగ్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో సి.ఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడ ఇసుక అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆమె కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. తనిఖీలు నిర్వహించే బృందాలలో ఖీఆక్ష, ఆ÷ూఖ స్థాయి అధికారి ఉండాలన్నారు. అధికారులు స్టాక్‌యార్డులు, ఇసుక రీచ్‌ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్‌లతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా తనిఖీ చేయాలన్నారు. ÷ూష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్ లు నిర్వహించాలని, తనిఖీల కోసం సంబంధిత శాఖలతో జాయింట్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. రీచ్‌లు, స్టాక్‌యార్డుల నుండి అనధికారికంగా ఇసుకను తరలించకుండా 24 గంటలు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ఏమాత్రం అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ డిజి బి.శివధర్ రెడ్డి, ఎడిజిపి మహేష్ భగవత్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, డిఎంజి శశాంక, టిజిఎండిసి ఎండి సుశీల్ కుమార్ ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదు..

### అర్చకుడిపై దాడి అమానవీయ చర్య
### మంత్రి శ్రీధర్ బాబు వార్నింగ్
### రంగరాజన్‌కు పరామర్శ



**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. రంగరాజన్‌పై దాడి చేసిన నిందితుల్లో ఇప్పటికే కొందరిని పోలీసులు అరెస్టు చేశారని మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు. రామరాజ్యం పేరా అరాచకాలు సాగిస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు వార్నింగ్ ఇచ్చారు. చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానవీయ చర్య, తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మంగళవారం చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి హనుమంతరావు పరామర్శించారు. సౌందర్య రాజన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిపై శ్రీధర్ బాబు, మహేందర్ రెడ్డి ఆరా తీశారు. దాడి ఘటనను అడిగి నేతలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద భద్రత పెంచాలని పోలీసులను ఆదేశించారు. రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.రంగరాజన్‌పై దాడి చేసిన నిందితుల్లో ఇప్పటికే కొందరిని పోలీసులు అరెస్టు చేశారని మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు.

## నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది: మహేందర్ రెడ్డి

రాముడు పేరు మీద దాడులు చేయడం దురదృష్టకరమని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని మహేందర్ రెడ్డి చెప్పారు.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
బుధవారం
12 ఫిబ్రవరి 2025


# లోపాయికారి ఒప్పందమేమి లేదు!




- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో పోటీలో లేము
- అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం
- బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నారు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానని.. దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో తాము పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు. మోదీ సర్కార్ వెంటనే దేశంలో జనాభా లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. కులగణన నుంచి తప్పించుకోవటానికే మోదీ.. జనగణన చేయటంలేదని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు నుంచి తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. డీ లిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. 2026లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని విభజన చట్టంలో ఉందని చెప్పుకొచ్చారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ ప్రభావం వల్ల వాయిదా పడ్డాయన్నారు. గుడ్డి ఎద్దు చేనులో పడినట్లు.. మోదీ పాలన చేస్తున్నారని ఆక్షేపించారు. 2011లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పేదలకు రేషన్ ఇవ్వటం ఇష్టంలేకనే జనాభా లెక్కలకు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. జనాభా లెక్కింపు జరిపితే కొత్తగా 10కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు వస్తాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

## కులగణనలో పాల్గొని వారు బీసీలపై ప్రేమనా..?

### ముందు కులగణనలో పాల్గొనండి

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు పత్రాలను పంపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, ఫిబ్రవరి 11 :** బీసీలపై ప్రేమ కురిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రి, మంత్రులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముందుగా కులగణనలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా కులగణన దరఖాస్తులను వారికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ముందు మీరు కులగణనలో పాల్గొని.. అప్పుడు మాట్లాడాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆరెస్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉందా.. చేతగకపోతే నోరు మూసుకుని కూర్చోవాలన్నారు. కులగణనపై బీజేపీ కుట్ర చేస్తోందని.. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మైనార్టీలను ఇప్పుడు కొత్తగా బీసీల్లో చేర్చలేదని.. మైనార్టీలు ఎప్పటి నుంచో బీసీల్లో ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రంతో దేశ వ్యాప్తంగా కుల సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే.. బీసీ సమాజం బాధపడిందని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత లిక్కర్ నినాదం అయి పోయిందని, ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకున్నారని అన్నారు. కవితకు అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటారని, ఆమె ఒక ఆడబిడ్డ.. ఆమెను విమర్శించాలని తమకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## మూడురెట్లు పెరిగిన శిలాజేతర ఇంధన వినియోగం

- సౌర ఉత్పత్తి సామర్థ్యం రెట్టింపుతో మూడోదేశంగా గుర్తింపు
- ఇంధన వార్షికోత్సవాలను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** శిలాజేతర ఇంధన శక్తి ఉపయోగంలో భారతదేశం వాడుక మూడురెట్లు పెరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. సౌర ఉత్పత్తి సామర్థ్యాన్ని డబుల్ చేసి మూడో అతిపెద్ద సౌరశక్తిని ఉత్పత్తి చేసే దేశంగా భారత్ నిలిచిందని మెచ్చుకున్నారు. భారత్ ఇంధన వార్షికోత్సవాలు 2025ను ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇండియా తన వృద్ధిని సాధించడంతో పాటు ప్రపంచ వృద్ధి రేటును నడిపిస్తోందని ప్రశంసించారు. ఇంధన రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు. 21వ శతాబ్దం భారత్‌దేనని ప్రపంచంలోని నిపుణులు చెబుతున్నారని, వనరులు, మేధో సంపత్తి, ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, ప్రపంచ సుస్థిరతపై భారత్‌కు నిబద్ధత ఉందని మోడీ స్పష్టం చేశారు. 2030 సంవత్సరం నాటికి జీరో కర్బన ఉద్గార లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ప్రతి సంవత్సరం ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. పారిస్ జి20 ఒప్పంద లక్ష్యాలను చేరుకున్న తొలి దేశం భారతేనని, రానున్న రెండు దశాబ్దాలు భారత దేశానికి అత్యంత కీలకమని ఆయన తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, పిఎం మోడీ అధ్యక్షత వహిస్తున్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోడీ సమావేశం కానున్నారు.

## రాహుల్ వరంగల్ పర్యటన రద్దు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దయింది. మంగళవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ వచ్చి.. ఆ తర్వాత వరంగల్ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తొలుత తెలిపాయి. వరంగల్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం కానున్నట్లు వెల్లడించాయి. అయితే పార్లమెంట్ సమావేశాల కారణంగా రాహుల్‌గాంధీ తన పర్యటనను తాజాగా రద్దు చేసుకున్నట్లు సమాచారం. వరంగల్ పర్యటన రద్దుతో కాంగ్రెస్ శ్రేణులు కొంత నిరుత్సాహం చెందారు.

# స్కూల్ డేస్‌లో నేనూ అల్లరి పిల్లనే

### ఎగ్జామ్స్ భయం వీడి ముందుకు సాగాలి

### పరీక్షాపై చర్చాలో నటి దీపికా పదుకొణె



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11:** స్కూల్లో చదువుకునేటప్పుడు తానూ అల్లరి పిల్లనే అని అంటున్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏటా నిర్వహించే ’పరీక్షా పే చర్చ ’ను ఈసారి కాస్త వినూత్నంగా నిర్వహించారు. ఇందులోభాగంగా నటి దీపిక పాల్గొని.. మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు సలహాలిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను తాజాగా ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నారు.‘చిన్నప్పుడు స్కూల్లో నేనూ సోఫాలు, టేబుల్స్, కుర్చీలు ఎక్కి అల్లరి చేసేదాన్ని. చదువుకునే రోజుల్లో చాలా ఒత్తిడి ఉంటుంది. ఉదాహరణకు నాకు లెక్కలంటే చాలా భయం. ఇప్పటికీ అందులో నేను వీక్‌గానే ఉంటా. అయితే, ఆ భయాన్ని అధిగమించాలి. ప్రధాని మోదీ రాసిన ’ఎగ్జామ్ వారియర్స్’ పుస్తకంలో వివరించినట్లుగా.. సమస్యను లోలోపల అణచిపెట్టుకోకుండా.. బయటకు చెప్పాలి. మీ తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబసభ్యులు, టీచర్లతో పంచుకోవాలి. జర్నల్ లేదా డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి. మిమ్మల్ని మీరు వ్యక్తపర్చుకోవడం కోసం అది గొప్ప మార్గం‘ అని దీపిక వివరించారు. తాను కూడా ఒక దశలో కుంగుబాటు సమస్యను ఎదుర్కొన్నట్లు నటి ఈసందర్భంగా తెలిపారు. దీపిక ఎపిసోడ్‌కు సంబంధించి తాజాగా ట్రైలర్ మాత్రమే పంచుకున్నారు. పూర్తి వీడియోను ఫిబ్రవరి 12న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీకి దీపిక కృతజ్ఞతలు తెలియజేశారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. కాగా.. ’పరీక్షా పే చర్చ’లో భాగంగా సోమవారం దిల్లీలోని సుందరవనంలో ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలే జీవితంలో సర్వస్వంగా చూడకూడదని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇతరులతో పోల్చడం మానుకోవాలని, బయటివారికి చూపించడానికి మోడల్స్‌గా వారిని ఉపయోగించుకోకూడదని సూచించారు. ఇక ఈ ఏడాది ’పరీక్షా పే చర్చ’లో దీపికా పదుకొణెతో పాటు బాక్సర్ మేరీ కోమ్, ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్, యూట్యూబర్–టెక్నికల్ గురు రాధికాగుప్తా వంటి వివిధ రంగాల ప్రముఖులు కూడా పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను, పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. అందుకు సంబంధించిన పాడ్‌కాస్ట్ ఎపిసోడ్స్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.

## రైతుల కోసం ఎంతటి పోరాటాలైనా సిద్ధం

### మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు



**సిద్దిపేట, ఫిబ్రవరి 11 :** రైతుల కోసం ఎంతటి పోరాటాలు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధరలేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

## రక్షణరంగంలో స్వావలంబన, ఎగుమతులు

### ఆత్మనిర్భర భారత్‌తో సవాళ్లను అధిగమిస్తున్న రక్షణశాఖ

**బెంగళూరు, ఫిబ్రవరి11:** కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణరంగ ఉత్పత్తుల్లో భారత్ దూసుకుపోతోంది. మన దేశంలో కొత్త పరికరాల తయారీయే కాకుండా ప్రపంచం కోసం తయారుచేయాలనే పిలుపును అందిపుచ్చుకున్న రక్షణరంగం– అత్యాధునిక సామర్థ్యాలతో భావి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. కర్ణాటకలో యలహంకలోని వైమానిక కేంద్రంలో జరుగుతోన్న 15వ ఏరో ఇండియా ప్రదర్శన వీటన్నింటికీ వేదికగా నిలిచింది. 2047 వైపు పురోగమిస్తోన్న భారత్.. వైమానిక రంగంలో స్వావలంబన, సాంకేతికంగా అధునాతన శక్తిగా ఆవిర్భవించేందుకు కట్టుబడి ఉంది. ఇంటిలిజెన్స్, నిఘా, లాజిస్టిక్స్‌లో మన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడంతో మిలిటరీ ఆపరేషన్‌లలో కీలకపాత్ర పోషించడానికి వీలు కలగనుంది. అలాగే తర్వాత తరం యుద్ధ హెలికాప్టర్లు, ఏఐ ఆధారిత డ్రోన్లను అభివృద్ధి చేయడం వల్ల మన సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ నారీశక్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పలు కీలక పోస్టుల్లోకి మహిళా అధికారులను తీసుకుంటోంది. దీంతో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా మిలిటరీ ఆపరేషన్లలో నారీమణులు కీలకంగా వ్యవహరించేందుకు దోహదం చేయనుంది. ఆ దిశగా 2022లో మిలిటరీ పైలట్లుగా చేరిన వారిలో మేజర్ అభిలాషా బారక్.. ప్రతిష్ఠాత్మక సిల్వర్ చీతా ట్రోఫీని దక్కించుకున్నారు. కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణలో భాగంగా అద్భుతమైన ప్రతిభ చూపినవారికి దీనిని అందిస్తారు. ప్రస్తుతం ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్‌లో 13 మంది మహిళలు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ ఆపరేషన్లలో 8 మంది, వివిధ ఆర్మీ ఏవియేషన్ స్క్వాడ్రన్‌లలో 9 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే యుద్ధరంగంలోనూ వారిని మోహరిస్తున్నారు. వారి సామర్థ్యాన్ని గుర్తించిన భారత సైన్యం.. మహిళా అధికారులకు సాధికారత కల్పించడానికి కట్టుబడి ఉంది.



# మాఘపౌర్ణమితో కుంభమేళాకు రద్దీ

## పౌర్ణమి రోజు నదీ, సముద్రస్నానాలకు శ్రేష్ఠం




ప్రయాగరాజ్, ఫిబ్రవరి 11: మాఘ పూర్ణిమ.. కారణంగా కుంభమేళాకు మరింతగా భక్తులు పోటెత్తనున్నారు. ఇప్పటకే రోజుకు కోటిన్నర వరకు పుణ్యస్నానాలకు వస్తున్నారని అంచనా. ఈ నెల 12న మాఘపూర్ణిమ కారణంగా మరింత రద్దీ పెరగనుంది. ఇప్పటికే వందల కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హిందూ పురాణాల ప్రకారం ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల ఆర్థిక బాధలు తొలగి అష్టైశ్వర్యాల సిద్ధి కలుగుతుందని చెప్తారు. పౌర్ణమి నాడు బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేసి సూర్య భగవానుడికి అర్ఘ్యం అర్పించడంఅ వసరమని అంటున్నారు. దీంతో త్రివేణి సంగమానికి భక్తులు పోటెత్తనున్నారు. స్నానానంతరం పూజా కైంకర్యాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. వీలైతే ఏదైనా దేవాలయాన్ని సందర్శించడం వల్ల శుభం కలుగుతుంది. ఈ రోజున చేసే గంగా స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కానీ, ఇది అందరికీ సాధ్యపడకపోవచ్చు. కాబట్టి వీలైనవారు నదీ స్నానం చేసుకుని శివకేశవులను ఆరాధించుకోవచ్చు. మాఘ పౌర్ణమి రోజున మద్య మాంసాలకు దూరంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లో జీవహింస చేయరాదు. ఇనుప వస్తువులు, నల్లని బట్టలు, వెండి, పాలు, ఉప్పు, సూదులు, కత్తెరలు వంటి పదునైన వస్తువులు బయటకు ఇవ్వకూడదు. ఇలా చేయడం వల్ల శని, చంద్ర దోషాలు వస్తాయని చెప్తారు. వీలైతే వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లిని తీసుకోకుండా ఉండాలి. మీ భోజనం మీరే వండుకోవడానికి ప్రయత్నించండి. ఇక ఇతరులను మోసగించడం, దూషించడం, శారీరకంగా, మాటలతో గానీ హింసించడం వంటివి చేయకూడదు. ఇతరులను అకారణంగా నిందించకూడదు. నల్ల దుస్తులు ధరించకూడదు. రాత్రి ఎక్కువ సమయం వరకు మేలుకుని ఉండకూడదు. ఈ రోజు కచ్చితంగా బ్రహ్మ ముహూర్తంలో స్నానం ఆచరించడానికి ప్రయత్నించడం మంచిదని అంటున్నారు. ఇది ఎంతో శ్రేష్ఠమైనదిగా నమ్ముతారు. అవసరంలో ఉన్నవారికి, పేదవారికి అన్న, వస్త్ర దానాలు చేయడం చాలా మంచిది. విష్ణు మూర్తిని పూజించడం, పౌర్ణమి వెన్నెల్లో విష్ణు సహస్రనామం జపించడం ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజు చేసే ఉపవాసం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి. రోజున ఆహారం దానం చేసిన వారికి జీవితంలో ధనానికి, తిండికి లోటు ఉండదని నమ్ముతారు. లక్ష్మీదేవి వారింటిని ఐశ్వర్యంతో నింపుతుందని నమముతారు. పౌర్ణమి రోజున సౌందర్య సాధనాలను దానం చేయడం వల్ల భర్త పిల్లల ఆయుష్షు పెరుగుతుందని ఉత్తరాది ప్రజలు నమ్ముతారు. ఇలా చేయడం వల్ల లక్ష్మి దేవి ప్రసన్నం కలుగుతుందని నమ్ముతారు. మాఘపౌర్ణమి సందర్భంగా కూడా కుంభస్నానానికి వస్తారు. మౌని అమావాస్యతో పాటు ఈరోజుకు కూడా విశేష ప్రాధాన్యం ఉంది.



# అవినీతి రాజకీయాలను ప్రజలే పాతరేయాలి!

వివిధ కేసుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను తక్షణం రాజకీయాలకు దూరంగా చేయాల్సిన అవసరాన్ని తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రజాస్వామ్యవాదులను, లేదా భారత ప్రజలను హెచ్చరించింది. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు నేరస్తులు అయివుంటే ఆ చట్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవాలి. చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం చూస్తున్నాం. కోర్టు తీర్పులను కాలరాస్తున్న నేతలను చూస్తున్నాం. ఇలాంటి సమయంలో సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రజలకు కనువిప్పు కావాలి. అవినీతి, క్రిమినల్ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలంతా చైతన్యం కావాలి. మాకొద్దీ దగుల్బాజీ రాజకీయమని నినదించాల్సి ఉంది. మరో అన్నా హజారే లాగా ఉద్యమించాల్సి ఉంది. ప్రజలు తమ దేశం కోసం లేదా అవినీతి లేని రాజకీయం కోసం కొంత సమయం వెచ్చించాల్సి ఉంది. చిన్న లంచం తీసుకుంటేనే అరెస్ట్ చేసి బొక్కలో వేస్తున్న మనం..ఇప్పుడు క్రిమినల్ కేసులు, డబ్బులు స్వాహా చేసిన వారిని, ప్రజాధనం లూటీ చేసిన వారిని రాజకీయాల్లో కొనసాగించడం అవసరమా అన్నది చర్చించాలి. ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై సుప్రీం కోర్టులో సోమవారం విచారణ జరిగింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42 మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవన్నారు. నిజానికి చట్టాలు చేసే పార్లమెంట్, అసెంబ్లీలో క్రిమనల్స్ లేదా కేసులు ఉన్నవారు మంచి చట్టాలు చేస్తారని అనుకోవడానికి లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఐదేళ్లు సిఎంగా పాలన చేశారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేశారు. తొమ్మిదిన్నరేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ అనేక ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయనే అన్నాహజారే జనలోక్‌పాల్ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు. కానీ కోర్టు కేసుల్లో ఉన్న నేతలు మళ్లీ మళ్లీ ఎన్నికవుతూ...ఈ సదాశయాన్ని తుగంలో తొక్కారు. తమ విలాసాలకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. అందుకు కేజ్రీవాల్ నివాసం, విశాఖలో జగన్ కట్టించిన విలాసవంతమైన భవనాలే నిదర్శనం. ప్రజలు తిండికి, గుడ్డకు కష్టపడుతుంటే ..ప్రజాధనంతో జల్సాలు చేసే నేతలు దేశానికి అవసరమా అన్నది ప్రజలే ఆలోచించాలి. ఇకపోతే కేసులు ఎదుర్కొంటున్న నిందితులు ఏళ్లుగా విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం జాప్యానికి మరో కారణమని నివేదికలో పొందుపరిచారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరేందుకే అనర్హులని, అలాంటిది ప్రజా ప్రతినిధులుగా ఎలా అర్హులవుతారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది.ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని కూడా సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని ర ష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. నిజానికి సుప్రీం వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఆనాడు అన్నాహజారే వెలిబుచ్చారు. రాజకీయ అవినీతిని తరిమేందుకు ప్రత్యేక కోర్టులు లేదా జనలోక్÷-పాల్ రావాలని డిమాండ్ చేశారు. నేను అవినీతికి వ్యతిరేకమని అంటున్న మోడీ కూడా దీనిగురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకపోతే రాజకీయ నేతలు తెలివిలో ఆరితేరారు. లాలూప్రసాద్పై కేసు రాగానే ఆయన భార్యను రంగంలోకి దింపారు. తరవాత కుమారుడు రంగంలోకి దిగాడు. శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తున్నారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్ఠంగా ఉండరాదు. అలా ఉంటే తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. అందుకే రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం వ్యక్తం చేసింది. 42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటని తెలిపింది. శిక్షపడ్డ ప్రజాప్రతినిధులపై కేవలంఆరేళ్ల పాటే అనర్హత వేటు వేసి వదిలేస్తే ఎలా అని కూడా సంశయించింది. వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలని వ్యాఖ్యానించింది. దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా అని కూడా ప్రశ్నించింది. సుప్రీం అభిప్రాయం ప్రకారం నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడం అవసరం. అప్పుడే మన ప్రజాస్వామ్యంలో కళంకితును దూరం చేయగలం. ఈ విషయంలో మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన నేపథ్యంలో వారి అభిప్రాయం ఎలా ఉన్నా ప్రజలు ముఖ్యంగా ఓటేస్తున్న ఓటర్లు చర్చించాలి. క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని నెత్తికి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందా అన్నది విచారణ చేయాలి. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశంగానే చూడాలి. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాల్సిందే. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే సుప్రీం అభిప్రాయానికి అనుగుణంగా ఓటర్లు స్పందించాలి. జనం స్పందించాలి. నేరమయ రాజకీయాలకు పాతరేయాలి. ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరినా అల ఆజరుగుందని అనుకోవడానికి లేదు. వారు సానుకూలంగా స్పందిస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. అదేదో ప్రజలే చేయాలి. నేరమయ రాజకీయ నేతలను దూరంగా పెట్టే చైతన్యంతో సాగాలి.



# 16 నుంచి 19 వరకు పెద్దగట్టు జాతర

### 65వ జాతీయ రహదారిలో వెళ్లే వాహనాల దారి మళ్లింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 11:** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం పెద్దగట్టు జాతర ఈనెల 16 నుంచి 19 వరకు జరగనుంది. యాదవుల కులదైవం పెద్దగట్టు లింగమంతులస్వామి ఇక్కడ పూజలందుకోనున్నాడు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఏర్పాట్ల కోసం ఇటీవల రూ.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటుగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది 10-15 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనా. జాతర నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై ప్రయాణించేవారికి ట్రాఫిక్ అలర్ట్ జారీ చేశారు. 65వ జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈనెల 16న తెల్లవారుజాము నుంచి దారి మళ్లింపు, ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. వాహనదారులు సహకరించాలని కోరారు.



# కుంభమేళాలో నో వెహికల్ జోన్

## మాఘపౌర్ణమితో ట్రాఫిక్ ఆంక్షలు

### రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తుల రాకపై సిఎం సమీక్ష



**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 11:** మాఘ పూర్ణిమతో పాటు కొన్ని రోజుల్లో కుంభమేళా పూర్తికానున్న నేపత్యంలో ప్రయాగ్‌రాజ్‌కు భారీగా భక్తులు తరలిరానున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఆ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దానిని దృష్టిలో ఉంచుకొని మాఘ పూర్ణిమ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఒకరోజు ముందు నుంచే మంగళవారమే ఆంక్షలు విధించారు. ఇప్పటికే గత వారాంతం ఎఫెక్ట్‌తో 350 కి.మీ. దూరం వరకు వాహనాలు నిలిచిన సంగతి తెలిసిందే. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని అధికారులు కొత్త ఆంక్షలను అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా మార్పు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ మొత్తాన్ని నో వెహికల్ జోన్‌గా మారుస్తామని వెల్లడించారు. శని, ఆదివారాల్లో లక్షల మంది కుంభమేళా యాత్రికులు ఏకంగా 24 గంటలకు పైగా రహదారి పైనే వాహనంలో ఉండిపోవాల్సి వచ్చింది. జబల్‌పూర్-ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయ-రహదారిపై సుమారు 350 కి.మీ. పొడవున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటన ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌గా చరిత్ర పుటలకు ఎక్కింది. మరో 48 గంటల పాటు ఎవరూ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకుసాగాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. 50 కి.మీ. మేర దూరం వెళ్లడానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి సోమవారం రాత్రి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పోలీసులు, అధికారులు సమావేశమయ్యారు. 'రోడ్లపై వాహనాలు భారీగా చేరకుండా చూడాలి. రద్దీ లేకుండా చూసుకోవాలి. పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశాలు ఇచ్చారు.

# వేసవికి ముందే భానుడి భగభగలు

### పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి11 :** వేసవి ప్రారంభానికి ముందే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచే భానుడు దంచి భగభగమంటున్నాడు. మధ్యాహ్నం సమయాల్లో అయితే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 35 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా, రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటుగా.. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే మూడు నుండి 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌కు, ఇతర జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో తీవ్రమైన వేడి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేయటం ఖాయమని అంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ -హైదరాబాద్) అంచనా వేసింది. సోమవారం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయని చెప్పింది. ఇంకా ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 38 డిగ్రీల నుండి 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. హైదరాబాద్ నగరంలో 36 డిగ్రీల సెల్సియస్ నుండి 38 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అంటున్నారు. ఫిబ్రవరి 19 లేదా 20 వరకు కనీసం 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. కాగా, ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



# కుంభమేళాకు 140 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** ప్రయాణికులకు సౌకర్యార్థం కుంభమేళా జరిగే ప్రదేశాలకు దక్షిణమధ్యరైల్వే పరిధిలో 140 ప్రత్యేకరైళ్లు నడిపామని అధికారులు ప్రకటించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆయా రైళ్లలో సుమారు 1.30లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్న గయా, దానాపూర్, పాట్నా, ఆజంఘడ్, ప్రయాగరాజ్, రక్సాల్, బనారస్, గోమతినగర్(లక్నో) ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్లివచ్చారని తెలిపారు. ఇవి కాకుండా ఇతర జోన్ల నుంచి మరో 39 ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్యరైల్వే జోన్ మీదుగా వెళ్లాయని పేర్కొన్నారు. కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేకరైళ్లన్నీ 149శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని వెల్లడించారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవకుండా లక్నో, ప్రయాగరాజ్, న్యూఢిల్లీ డివిజన్ కార్యాలయాల నుంచి సీనియర్ రైల్వే ఉన్నతాధికారులు యాత్రికుల రద్దీని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, ఆయా ప్రాంతాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోందని, రైళ్లు ఎక్కడివక్కడ ఆగిపోయాయని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం సరికాదని సీపీఆర్ఓ తెలిపారు. కుంభమేళాకు ప్రయాణికులు సజావుగా వెళ్లి వస్తున్నారని పేర్కొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షిత రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com
బుధవారం
12 ఫిబ్రవరి 2025





# మాలి మహా సంఘం నూతన కమిటీలు

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ : అఖిల భారతీయ మాలి మహా సంఘం జాతీయ అధ్యక్షులు విలాసరావు పాటిల్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర జిల్లా యువజన మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షునిగా నాలుగవసారి సుకుమార్ పెట్టుకులే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సురేష్ గురునులే బేల మండల్, నారాయణ గురునులె,వాంకిడి మండల్ ఎన్నికైనారు.రాష్ట్ర కోశాధికారిగా సతీష్ గురునూలే ఆదిలాబాద్ ఏకగ్రీవంగా ఎన్నికగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణ బెజ్జూర్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా వినోద నాగోషి హైదరాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉజ్వల ఉమేష్ రావు డోలే, ప్రధాన కార్యదర్శిగా వనిత చౌదరి, ఉపాధ్యక్షురాలుగా కోట్రంగి గోదావరి, కోశాధికారిగా లక్ష్మీ షిండే, సాంస్కృతిక కార్యదర్శిగా లీనా అంబేకర్, సంయుక్త కార్యదర్శిగా గంగుతాయి షిండే, శాలిని ప్రధాన్, కార్యవర్గ సభ్యులుగా మనిషా గురునులే, కల్పన పెట్కులే, స్మిత పెట్కులే, సంగీత గురుణులే, అంజలి పెట్కులే, తాను బాయి తాంసి జన బాయ్ వాడై సంజీవిన షిండే లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షునిగా అడ్వకేట్ ఉమేష్ రావు డోలే ఎన్నికగా కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాడఈ పాండురంగ్ (బెండర, వాంకిడి) ఏకగ్రీవంగా ఎన్నికైనరు. ఉమ్మడి జిల్లా పటేల సంఘం అధ్యక్షునిగా నారాయణ షిండే (కేరమేరి) ఎన్నిక కాగా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా నాగోషే శంకర్ (ఆసిఫాబాద్) ఏకగ్రీవంగా, ఎన్నుకోబడ్డారు. యువజన విభాగం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షునిగా మొహూర్ల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగోషిసాగర్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా కోట్రంగి సాగర్, వాడే సుధాకర్ ఎన్నుకోబడ్డారు. జాయింట్ సెక్రటరీగా ముహూర్లి తిరుపతి, సెండే చంద్రశేఖర్, మోర్లే సతీష్, మాండూరి ఉల్లాస్, ప్రచార కార్యదర్శిగా నికోడే రమేష్, ఉపాధ్యక్షులుగా లేనగురి శంకరులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా నందకిషోర్ నాగోషి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్ కోట్రంగి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ ముహూర్లే ,కోశాధికారిగా రమేష్ గూర్నులే , రాందాస్ మోర్లే ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా అశోక్ నాగోషే, సునీల్ షిండే, దత్త గురుణులే, అశోక్ షిండే, సతీష్ లేనగురి, ఉద్ధవ్ వాడగురే లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా విజయ్ వాడగురే, ప్రధాన కార్యదర్శిగా ఉత్తం వాడగురే, ఉపాధ్యక్షుడిగా విట్టల్ కోట్రంగే, సంయుక్త కార్యదర్శిగా అంబాదాస్ షిండే కోశాధికారిగా బండారి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ చౌదరి, రవీందర్ షిండే, బెల్లపు రమేష్, గజానంద్ గురునులే లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఘనంగా టిల్కా మాంజి జయంతి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల కేంద్రంలోని ఆదివాసి భవన్ లో మంగళవారం భారత స్వతంత్ర సమరయోధులు ఆదివాసీ ఉద్యమ నాయకుడు టిల్కా మాంజి 276వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయి సెంటర్ మండల సర్మేడి కోడప శంకర్ మాట్లాడుతూ... తొలి తరం భారత స్వాతంత్ర సమరయోధులు బాబా టిల్కా మాంజి అన్నారు. 1784లోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఆయుధాలు చేతపట్టిన గోండు ఆదివాసీ సంతల్ వీరుడు టిల్కా మాంజి అన్నారు. ఆయన జీవితం ఆదివాసులకు ఆదర్శమని ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన కలలుగన్న భారతదేశాన్ని నిర్మించుకుందామని తెలిపారు. నేడు మండలంలోని వివిధ ఆదివాసీ గ్రామాలలో వైరుధ్యాలు పెంచి ఆదివాసులను విభజన చేయడానికి కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అమాయక ఆదివాసులను రెచ్చగొట్టె ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆదివాసులకు ఏమి జరిగిన ఆయా వర్గాలు బాధ్యత వహించాలని రాయి సెంటర్ హెచ్చరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ సర్మేడి కొడప శంకర్, ఆదివాసి మహిళా సంఘం మండల అధ్యక్షురాలు ఆత్రం అమృత, మానేపల్లి మల్లేష్, చింతపుడి దేవాజీ, పేదం ధర్మయ్య, పోల్కా వెంకటేష్, సడమేక నీలయ్య, కళంగీర్, శ్యాంసుందర్, విజయ్, ఆలమ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని బీజేపీ తిర్యాణి మండల మాజీ అధ్యక్షుడు పులి వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మరో మారు పేదల ప్రభుత్వము అనే నిరూపించుకుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 26 వేల 216 కోట్లు రాష్ట్రానికి రానున్నాయని, గతేడాది రాష్ట్రానికి పన్నుల వాటా కింద 23,216 కోట్లు రాగా ఈసారి ₹3,000 కోట్ల రూపాయలు అదనంగాఇస్తున్నందుకు మోడీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దీంతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు 2273 కోట్ల ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి రానున్నాయని, ఇవే నిధుల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు 147 కోట్లు అదనంగా ఇవ్వడాని మోడీ సహకారాన్ని స్వాగతిస్తూ పట్టణ స్థానిక సంస్థలకు 796 కోట్లు వస్తున్నాయి దేశంలో మరో ఏడాదికి స్మార్ట్ సిటీల ప్రాజెక్టును కొనసాగించడానికి కేంద్రం అంగీకరించడానికి స్వాగతిస్తూ 2236 కోట్లు కేటాయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఉద్యమ కెరటం, పెంచికల్‌పేట్: పెంచికలపేట్ మండలంలోని ఆగర్గుడా గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో 10 త పది రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఫైనల్‌కు చేరింది. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి 20వేలు, రెండో బహుమతి రూ.10వేలను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువత, మండల నాయకులు పాల్గొన్నారు.

# సూచనలివ్వండి

**ఉద్యమ కెరటం,ఉట్నూర్:** ఆదిలాబాద్ జిల్లా సమస్త సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, సమన్వయకర్తలు, గౌరవ సలహాదారులు, కవి, కళాకారులకు అందరికి సేవాలాల్ జయంతి ఉత్సవం ఏర్పాట్లు గురించి సూచనలు, సలహాలు అందించేందుకు ఆహ్వానిస్తున్నట్లు సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావు (విశ్రాంత ఈఈ) తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావు ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశం యాదవ సంఘం భవన్, జి.సి.సి కార్యాలయం దగ్గర ,ఆదిలాబాద్ లో ఉందని, సేవాలాల్ జయంతి ఉత్సవ తాజా మాజీ సభ్యులందరూ సకాలంలో హాజరై, అభిప్రాయాలను తెలిపి, జయంతి ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.



# భూసార, సాగునీటి సేకరణపై అవగాహన

**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొలాస , జగిత్యాల.వ్యవసాయ కళాశాల. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వ్యవసాయ అనుభవ పూర్వక అభ్యసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లి గ్రామం, తాండూర్ మండలంలో భూసార, సాగు నీటి సేకరణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి కే సుష్మ, వ్యవసాయ విస్తరణ అధికారుల ఉప్పులేటి శంకర్, ఎం వెంకటేష్, వీ ధనలక్ష్మి, గ్రామ రైతులతో కలిసి మట్టి నమూనా సేకరించారు. ఇందులో భాగంగా విద్యార్థులు దుర్గంశ్రీధర్, చొప్పదండి తిరుపతి, రైతులు చొప్పరి సారయ్య, కొడిపే విమల తదితర రైతులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ :** మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని కృష్ణవేణి అన్నారు. మంగళవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకి రూ.7550 ఉంటుందని సూచించారు.రైతులు తమ సరుకును బాగా ఎండబెట్టి, శుభ్రపరిచిన తర్వాత యార్డునకు తీసుకొని రావాలన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకము, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను తీసుకొని రాగలరు.రైతు సోదరులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొరారు.ఈ కార్యక్రమంలో సంఘం సిఇఓ నాగభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిపై అవగాహన



**ఉద్యమ కెరటం, తాండూర్:** మంచిర్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తాండూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎంజేపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. అలాగే ఒత్తిడి నిర్వహణ, నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో రాఘవయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెచ్ఈఓ లక్ష్మణ స్వామి, ఎస్‌యూఓ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం శోభ, ఆశ వర్కర్లు తిరుమల, టీచర్ల బృందం పాల్గొన్నారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలు



**ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ):** నర్సాపూర్ మండలంలో ఒక జడ్పీటీసీ స్థానంతో పాటు ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, అదే విధంగా పోలింగ్ బూత్ కేంద్రాల సంఖ్య 38 పూర్తి ఓటర్ల సంఖ్య 20231 ఉందన్న సమాచారంతో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని నోటీసు బోర్డ్ మీద వివరాలు ప్రచురించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ జనార్ధన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సగ్రిగేషన్ షెడ్ పరిశీలన

ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ): మండల కేంద్రంలోని రాంపూర్ గ్రామంలో ఎంపీడీవో పుష్పలత స్థానిక కార్యదర్శి తో కలిసి సెగ్రిగేషన్ షెడ్ పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీ కోసం సగ్రిగేషన్ షెడ్ ఉపయోగించాలని సూచించారు. తడి చెత్త పొడి చెత్త వేర-ంవేరుగా సేకరించి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చే విధంగా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం..రక్షణ రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# సంస్కృతిని భావితరాలకు అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- సంస్కృతి సమ్మేళన సభలో గుస్సాడి నృత్యం చేసిన కలెక్టర్





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదివాసి గిరిజన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ట్రైబల్ కల్చరల్ మీట్ 2024-25 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి విద్యార్థులు ప్రదర్శించిన ఛాయ చిత్ర కళ, తదితర వాటిని తిలకించి , ఎల్ ఎం ఎస్ అప్ ను సబ్ కలెక్టర్ యువరాజ్ తో కలసి ప్రారంభించేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో వివిధ జాతులు, వివిధ సంస్కృతులు భిన్న దృక్పదాలు ,భిన్న తెగలు ఉన్నప్పటికీ ఒకరి సంస్కృతి నుండి ఇంకొకరి సంస్కృతికి చాలా విషయాలు మానవ మాధ్యమం ద్వారా చేరి ఒక స్నేహ సంబంధాన్ని మానవ బంధాలను పెంచే విధంగా తోడ్పడుతున్నాయన్నారు.ప్రతి ఒక్కరూ తమ సంస్కృతిలో ఉన్న గొప్పదనాన్ని చాటి చెప్పుకునే అవకాశం మనకు రాజ్యాంగం కల్పించిందన్నారు.మన సంస్కృతిని కాపాడుకుంటూ ఇతర సంస్కృతులను గౌరవించడం తద్వారా సమానతను సాధించడమే లక్ష్యంగా సమగ్ర శిక్ష తెలంగాణ వారు ఈ సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో సంస్కృతి సమ్మేళనం, భిన్నసంస్కృతులు ఇంద్రవెల్లి మండలం ఉన్నత జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నిర్వహించుటకు, అందులో గోండు సంస్కృతిలోని చిత్రకళ ,నృత్య కళ - గుస్సాడీ థింసా లను పిల్లలకు నేర్పి వారిచే ప్రదర్శనలు ఇప్పించడానికి రెండు రోజుల వర్క్ షాప్ ను ఫిబ్రవరి 10, 11 తేదీలలో రెండు రోజులపాటు ఘనం గా నిర్వహించడం జరిగిందన్నారు.మంగళవారం జరిగిన సంస్కృతి సమ్మేళన సభ నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలందరూ గుస్సాడి, థింసా, తీజ్ నృత్యాలను ఎంతో కన్నుల పండుగగా ప్రదర్శించారని,సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సంప్రదాయాలు ఎప్పటికి ఇలాగే ఉండేలా చూడాలని ఆన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక రీతిలో ఆకట్టుకొని, పిల్లలచే వేయ బడిన గోండు చిత్ర కళ ప్రదర్శనను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, మంచి చేయి తిరిగిన చిత్రకారుల చిత్రాలతో సమానంగా ఉన్నాయని, ఈ చిత్ర కళ ను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులు వేసిన వివిధ రకాల నృత్యాలను తిలకించి, చిన్నారులతో కలసి గొండ్ నృత్యం లో పాల్గొన్నారు.అనంతరం స్టేట్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ , టీ - సాట్ ద్వారా రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితరాణా పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు సంసిద్ధత పై టెలికాస్ట్ చేయబడిన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి తిలకించి, తమకు గల సందేహాలను విద్యార్థులు నివృత్తి చేసుకోవలసిందిగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొదటిసారిగా జిల్లా కలెక్టర్ పాఠశాల విద్యాశాఖ వారు నిర్వహిస్తున్న ఎల్ ఎం ఎస్ అప్ ను జడ్పీస్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత ఎమ్మార్వో ప్రవీణ్ , సెక్టార్అధికారి ఉదయశ్రీ ఎంఈఓ శ్రీ మను కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,సాకేత్ రామ్ మోహన్ ,ఏపిసి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా ఆసిఫ్‌అలీ



**ఉద్యమ కెరటం, నిర్మల్ టౌన్:** ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ, జిల్లా పాలనాధికారి యువ న్యాయవాది ఆసిఫ్ అలీ ని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆసిఫ్ అలీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏజీపీగా నియమించినందుకు పాలనాధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున సివిల్ కేసుల పై కోర్టులో కచ్చితంగా కష్టపడి పని చేస్తానన్నారు. మైనార్టీ వర్గానికి చెందిన ఆసిఫ్ అలీని ఏజీపీగా నియమించినందుకు నిర్మల్ పట్టణానికి చెందిన పలువురు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగాలని బెల్లంపల్లి సిడిపిఓ స్వరూప రాణి తెలిపారు. మంగళవారం తాండూర్ మండలంలోని రేచిని రైల్వే స్టేషన్ అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహార పంపిణీ, ప్లే స్కూల్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. గర్భిణీలకు పిల్లలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో గృహ సందర్శనలు నిర్వహించి గర్భిణీలకు ఆహార నియమాలను గురించి వివరించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ప్లే స్కూల్ ద్వారా పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.అలాగే మాదారం అంగన్వాడి కేంద్రం పరిధిలో అంగన్వాడి టీచర్ మీనా గృహ శాసనదర్శన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులకు పౌష్టికాహారం ఆరోగ్యం ఆహార నియమాల పట్ల అవగాహన కల్పించారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ :** ఇచ్చోడ ఏఎంసీలో కందుల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. పీఏసీఎస్ ద్వారా ప్రభుత్వ మద్దతు ద్వారా క్వింటాలుకు రూ.7550 ధర ఉందని తెలిపారు. రైతులు మార్కెట్ యార్డుకు వచ్చేటప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ లను తీసుకురావాలని సూచించారు. ఏఎంసీ కార్యదర్శి రమేష్, అగ్రికల్చర్ ఏవో జాదవ్ కైలాస్, పిఏసిఎస్ సీఈవో రాథోడ్ ఈశ్వర్ ఉన్నారు.

## ప్రజల ఆరోగ్యంపై పట్టింపు లేదా?

### జిల్లాలో జోరుగా కల్తీ సరుకులు అమ్మకాలు



**ఉద్యమ కెరటం, వాంకిడి :** జిల్లాలో కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్ , స్వీట్ హౌస్ లలో జోరుగా నాణ్యత లేని నిత్యవసర వస్తువులు అమ్మకాలు జరుగుతున్నాయని , సంబంధిత శాఖ అధికారులు మాత్రం తనిఖీలు చేపట్టడం లేదని సిపిఐ ఎం ఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి, ఆదివాసీ నాయకులు రాజేష్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యాపారస్తులు కల్తీ సరుకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కాలం చెల్లిన సరుకులు అమ్ముతుండడంతో ప్రజలు అనారోగ్యాలకు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వారసంతలో పూర్తిస్థాయిలో వ్యాపారస్తులు నాణ్యత లేని నిత్యవసర వస్తువుల, అధిక ధరలకు అమ్మకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆదివాసి గిరిజన జిల్లాలోనూ అమాయక ప్రజలను వ్యాపారస్తులు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇసుక నిల్వలపై ఎస్పీ కొరడా



**ఉద్యమ కెరటం, నిర్మల్:** అక్రమ ఇసుక నిల్వలపై నిర్మల్ఎస్పీ జానకీ షర్మిల కొరడా ఝుళిపించారు. గాజుల్ పేట్, రాంనగర్, మంజులపూర్ ప్రాంతాల్లో తిరిగి సీజ్ చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాజేష్ మీనా,పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, అర్బన్ తహసిల్దార్ రాజు, పోలీస్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించిన నిల్వ ఉంచిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ టీం స్పెషల్ టాస్క్ ఫోర్సెస్ లను ఏర్పాటు చేశామని, అనుమతులు లేకుండా జిల్లాలో వేర్వేరు ప్రాంతాలనుండి ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో విశ్వసనీయమైన సమాచారం తో 17 ఇసుక రీచ్ లు, 35 ఇసుక నిల్వలను ఉన్నాయని సమాచారం ఉందని చెప్పారు. జిల్లాలోని గోదావరి, స్వర్ణ వాగు, శుద్ధ వాగు పరిసర ప్రాంతాల్లో నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని తెలిసిందని, ఆ ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహించే పోలీస్ సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు. అన్ని ప్రాంతాల్లో తిరిగి ఇసుక అక్రమ నిల్వలను రెవెన్యూ సహకారంతో సీజ్ చేయాలని తెలిపారు. ఇసుక రీచ్ ల నుండి ఎవరు అనుమతులు లేకుండా ఇసుక తరలించకుండా చూడాలన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకుందామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అన్ని మండలాల అధ్యక్షుల సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆడే వసంత్, మండల అధ్యక్షులు హీరసింగ్, తలమడుగు మండల అధ్యక్షులు సాయికిరణ్ , భీంపూర్ మండలం అధ్యక్షులు ముష్రన్ , సిరికొండ మండల అధ్యక్షులు సంజీవ్ , ఇచ్చోడ మండల అధ్యక్షులు క్రాంతి కిరణ్ , బజరత్నూర్ మండల అధ్యక్షులు దినేష్ కుమార్, బోథ్ మండల అధ్యక్షులు యాటకిరి రాజు, నేరెడిగొండ మండల సోషల్ మీడియా కన్వీనర్ రహిల్ మాలిక్, సోషల్ మీడియా కో కన్వీనర్ పవర్ రాజేష్, యువ నాయకులు పాల్గొన్నారు.



## ఫౌండేషన్‌సభ్యుడి రక్తదానం

**ఉద్యమ కెరటం, ఉట్నూర్ :** రక్తంహీనత కారణంగా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆత్రం సీతారాంకు అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం అవసరం ఉన్న విషయం తెలుసుకొని బ్రదర్స్ హ్యూమానిటీ ఫౌండేషన్ సభ్యుడు సాయి కృష్ణ రక్తదానం చేశారు. బ్రదర్స్ హ్యూమానిటీ ఫౌండేషన్ అత్యవసర పరిస్థితులలో అందుబాటులో ఉంటూ చేస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్స్ హ్యూమానిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు రహేల్ ఖాన్, సభ్యులు మణికంఠ,విక్రాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మసీదు పరిసర ప్రాంతాల్లో క్లీన్ చేయించండి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఈనెల 13న షాబ్ఏ బరాత్‌ను పురస్కరించుకొని పట్టణంలోని మసీదుల పరిసర ప్రాంతాలు, ఖబ్రస్తాన్‌లో క్లీన్ చేయించాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ భుజంగ రావుకు వినతి పత్రం అందజేశారు. ఖబ్రస్తాన్ లో విద్యుత్ లైట్లు బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియ , సభ్యులు మన్సూర్ బిన్ అబ్దుల్ రబ్, ముబాషిర్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ మండలంలోని దంతనపల్లిలో బుధవారం నిర్వహించే రమా సత్యనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆహ్వానించారు. మంగళవారం ఆయనను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి,నంది రెడ్డి,సంతోష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,కోమటి రెడ్డి, మల్లారెడ్డి,తిరుపతి రెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఉద్యమ కెరటం,ఉట్నూర్



ఉద్యమ కెరటం
నిజం.. రక్షిత రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com
బుధవారం
12 ఫిబ్రవరి 2025






# కన్నుల పండుగగా కల్యాణోత్సవం

## బాలాజీ వెంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న కలెక్టర్, ఏఎస్పీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ (రెబ్బెన) :** జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ లో వేద మంత్రోచ్ఛరణల నడుమ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జాతరలో భాగంగా మొదటి రోజున నిర్వహించిన అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కొలువై ఉండడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, కొబ్బరి, మామిడి ఆకుల తోరణాలు, కనువిందు చేసే వివిధ రకాల పూలతో శోభాయమానంగా ముస్తాబు చేయడం జరిగిందని, వేడుకలలో భాగంగా వెంకటేశ్వర స్వామి, అలివేలుమంగ, పద్మావతి దేవతామూర్తులను అందంగా అలంకరించడం జరిగిందని తెలిపారు. జాతరలో పాల్గొనేందుకు ఇతర జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుండి అశేష జనవాహిని హాజరవుతుందని, ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో వేద పండితులు దుద్దిల్ల నారాయణ శర్మ, ధీరజ్ శర్మ, ఆలయ అర్చకులు గణేష్, దినేష్ శర్మ లు వేదమంత్రాలతో పూజలు నిర్వహించగా భక్తుల కరతాళ ధ్వనులు, భాజా భజంత్రీలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగిందని తెలిపారు. ఈ నెల 11, 12 , 13 తేదీలలో జరగనున్న జాతర కొరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, త్రాగునీరు, పార్కింగ్, విద్యుత్తు, భారీ కేడ్లు, బందోబస్తు, అత్యవసర సేవలు, వైద్య శిబిరాలు, తాత్కాలిక మూత్రశాలలు తదితర సౌకర్యాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతరకు హాజరయ్యే భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్. పి. చిత్తరంజన్ దంపతులు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్, రెబ్బెన మండల తహసిల్దార్ రామ్ మోహన్, ఆలయ ఈ. ఓ. బాపు రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## మిస్ లీడింగ్ అడ్వర్టైజ్ మందులను విక్రయిస్తే కఠిన చర్యలు

డ్రగ్ ఇన్ స్పెక్టర్ అశ్విని

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** మిస్ లీడింగ్ అడ్వర్టైజ్మెంట్ఉన్న మందులను విక్రయించొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తప్పవని డ్రగ్ఇన్ స్పెక్టర్అశ్విని హెచ్చరించారు. జిల్లాలోని కాగజ్ నగర్ లో సోడియం ఫాస్పేట్ ఎనిమ బీపీ 100 మి.లీ.ను డీఎంఆర్ఓ ఏ చట్టం 1954 ప్రకారం సీజ్చేయడం జరిగిందని తెలిపారు. లేబుల్స్ పై మూర్ఛ రోగానికి పనిచేస్తుందని ముద్రించడం జరిగిందని, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ అబ్సేషనల్ అడ్వర్టైజ్ చట్టం ప్రకారం ఈ వ్యాధికి చికిత్స చేయడం మిస్ లీడింగ్ అని, ఇలా లేబుల్స్ పై ముద్రించిన సంబంధిత మధ్యప్రదేశ్‌లోని బండారి ల్యాబ్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## పదవి లేదు.. సేవాభావం వదలలేదు

గుల్జార్ మార్కెట్ మాజీ కౌన్సిలర్ తౌహీద్ ఉద్దీన్

**ఉద్యమ కెరటం, నిర్మల్ టౌన్:** ప్రజలకు సేవ చేయాలంటే పదవులే అవసరం లేదు.. అంకితభావం ఉంటే చాలు అని నిరూపిస్తున్నాడు స్థానిక గుల్జార్ మార్కెట్ మాజీ కౌన్సిలర్ తౌహిద్ఉద్దీన్. ఇటీవలే పదవికాలం పూర్తిచేసుకున్నా ఆయన, షబ్బే ఏ బరాత్ మార్చి1 నుంచి రంజాన్ పర్వదినం కావడంతో స్థానికంగా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బంది పనులు చేసే సందర్భంలో వారికి సహకరించారు. సేవ చేసేందుకు పదవితో పనిలేదని చెప్పారు. అందరు కలిసి మెలసి పనిచేస్తే అద్భుత ఫలితాలుంటాయన్నారు. పాలకుడు సేవకుడిగా మారిన వైనం చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# విస్మృత చరిత్రపై విరామమెరుగని కృషి

**భారత స్వాతంత్ర్యోద్యమం**
**ఆంధ్ర ముస్లిం యోధులు**
(పరిశోధనాత్మక చరిత్ర గ్రంథం)

రచన :
సయ్యద్ నశీర్ అహమ్మద్,


ప్రచురణ :
ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్,


పుటలు :
366, మౌంట్ బైండింగ్, జాకెట్,

ఖరీదు : 500

రచయిత సంచారవాణి :
9440241727

ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ విరచిత 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు' గ్రంథానికి ప్రముఖ కవి, సాహితీవేత్త షేక్ కరీముల్లా (వినుకొండ) రాసిన ఆప్తవాక్యం.
– సంపాదకులు






**షేక్ కరీముల్లా**

**భారత స్వాతంత్ర్యోద్యమం మొత్తం మానవజాతి చరిత్రలోనే ఒక మహత్తర ఘట్టం. దాదాపుగా రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పీడన భారతీయుల్ని కుదిపేసింది. బ్రిటీష్ ముష్కరులు తమ సామ్రాజ్యవాద దుర్నీతితో ఎదురు లేకుండా సాగుతున్న తరుణంలో వారికి వ్యతిరేకంగా 1857లోనే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. ఈ సంగ్రామంలో ప్రథమ వరుసలలో నిలబడి పోరాడిన ముస్లిం ప్రజానీకం చేసిన త్యాగాలు ఎన్నో ఉన్నాయి. అప్పటి నుండి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించేంత వరకూ దాదాపు ఎనిమిది లక్షల మంది ముస్లింలు మాతృభూమి స్వేచ్ఛ-స్వాతంత్ర్యాల సాధనకు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. తమతోటి హిందూ ప్రజలతో కల్సి ఎన్నో పోరాటాలు చేశారు. అందరూ కలలు కన్న స్వేచ్ఛ-స్వాతంత్ర్యాలు లభించాక ఉద్దేశ్యపూర్వకంగానే ముస్లింల త్యాగాలు విస్మరించబడ్డాయి. ముస్లింల దేశభక్తి ప్రశ్నార్థకం చేయబడింది. భారతదేశ చరిత్రకు నకిలీ నగషీలను అద్ది దాని ఆత్మ సౌందర్యాన్ని కప్పెట్టే నయానాజీలు నయా చరిత్రను ముందుకు తెస్తున్నారు.**

ఇలాంటి చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా పురిణిలో ఓ చరిత్రకారుడు పుట్టాడు. కాలం ఆయన్ని కలం యోధునిగా మలిచి విస్మృత చరిత్రను గానం చేసే ఎడారి కోయిలగా నిలిపింది. 1955 డిసెంబర్ 22న సయ్యద్ బీబి జాన్, సయ్యద్ మీరామొహిద్దీన్ దంపతులకు జన్మించి, ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగిగా, న్యాయవాదిగా, పాత్రికేయునిగా, రచయితగా జీవితాన్ని థలవారి సాగించి ప్రస్తుతం చరిత్రకారునిగా ఆయన స్థిరపడ్డారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ అన్న సాదాసీదా రచయిత కాదు. సామాన్యుల పక్షం నిలబడి చరిత్ర న్యాయస్థానంలో కలం బలంతో వాదిస్తున్న అసామాన్య చరిత్రకారుడు. నివురు గప్పిన నిప్పులాంటి చరిత్రను నిజాల కొలిమిలో సానబట్టి బలమ్మెన అక్షరాలను బలహీనులకు అందిస్తున్న సాహసి.

తెలుగు సాహిత్య చరిత్రలో రచయితలు, చరిత్రకారులు ఎంతోమంది ఉండవచ్చు. కానీ ఒక సదాశయంతో కూడిన దృక్పథంతో రచనలు సాగించేవారు అరుదుగా కన్పిస్తారు. ఆలాంటి కోవలో ముందువరసలో దర్శనమిస్తారు నశీర్ ఆహమ్మద్. ఒక విశాల ఆలోచనలతో, సహృదయంతో చరిత్రను అనుశీలనం చేస్తూ ఎటువంటి భావ ప్రక్షిప్తాలకు తావివ్వకుండా రచన చేయడంలో ఆయన చూపించే స్థితప్రజ్ఞత అనుసరణీయమ్మెనది. విస్మృత చరిత్రను ప్రమాణ పూరితమ్మెన నిరూపిత ఆధారాలతో శాస్త్రీయకోణం నుండి ఆవిష్కరించటం ఆయన సరికొత్త గ్రంథం 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు'లో కానగలిగాను. అక్షర పరమార్థం రసానుభూతిని కలిగించటం మాత్రమే కాదు. నిజానుభూతిని కలిగించటమూ కావాలి.

చరిత్ర ప్రజాస్వామీకరించబడాలి అనే భావన రచయిత గుండె నుండి వచ్చింది. ఒక రకంగా ఇది సత్యాన్వేషుల అందరి మాట. తెలుగునేల ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణ ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల గురించి పరిశోధించి, లభ్యమ్మెన చారిత్రక సమాచారంతో 'భారత స్వాతంత్ర్యోద్యమం : తెలంగాణ ముస్లిం యోధులు' పుస్తకం తెచ్చిన రచయిత ఆంధ్ర ముస్లిం యోధుల చరిత్రను, త్యాగాలను 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు' శీర్షికతో అలనాటి స్వాతంత్ర్యోద్యమ చరిత్రను అక్షరీకరించడంలోని ప్రజాస్వామిక భావన ఉదాత్తమమ్మెనది.

ఈ పుస్తకం కోసం అలనాటి చరిత్రను సేకరించడం ఆషామాషీ విషయం కాదు. ఎంతో సమయాన్ని మరెంతో ధనాన్ని కూడా వెచ్చించాలి. ఓపికతో ఎంతో మందిని కలిసి మరెన్నో విషయాలను సేకరించాలి. అందుకు ఎంతో ఓర్పు, సహనం కావాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్నాయి కనుకనే నశీర్ ఆహమ్మద్ గొప్ప రచయితగా, చరిత్రకారునిగా జనం గుండెల్లో నిలిచారు. మాతృభూమి స్వాతంత్ర్యం కోసం ఆంధ్ర ముస్లిం యోధులు ధనాన్ని, ప్రాణాల్ని, యవ్వనాన్నీ అర్పించిన అసమాన త్యాగాల చరిత్రను ఒడిసిపట్టి ఒకచోట చేర్చి, వరుసక్రమంలో కూర్చి పుస్తక రూపం ఇవ్వటం కేవలం ఈ పుస్తక రచయిత వల్లే సాధ్యమ్మెంది.

సయ్యద్ నశీర్ అహమ్మద్‌తో నాకో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన శ్రీమతి రమిజా భాను ఉద్యోగరీత్యా వినుకొండ ప్రాంతాన పనిచేసినప్పుడు 6 సంవత్సరాలు ఆయన తన కుటుంబంతో వినుకొండలో ఉన్నారు. ఆ రోజుల్లో ప్రతి సాయంత్రం కలిసే వాళ్ళం. భారతదేశంలో నానాటికీ మారుతున్న పరిస్థితులు, ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్న రాజ్యాంగ విలువలు, లౌకిక విలువల గురించి చర్చించుకునేవాళ్ళం. ఈ పరిస్థితుల్లో ముస్లింల చుట్టూ అనునిత్యం జరుగుతున్న విషప్రచారాలను పటాపంచలు చేయాలనే తపన ఆయనలో ఉండేది. మాతృభూమి విముక్తి పోరాటంలో సర్వం అర్పించి ఆంగ్లేయులతో పోరాడిన ముస్లిం దేశ భక్తుల చరిత్రను రాయటం ద్వారా అది సాధ్యమవుతుందనే నమ్మకం ఆయన మాటల్లో దృఢంగా కన్పించేది.

ఆ నమ్మకంతోనే ఆయన న్యాయవాద వృత్తిని, పాత్రికేయ వృత్తిని పూర్తిగా వదిలేసి తన శ్రీమతి షేక్ రమిజా భాను గారి ప్రోత్సాహంతో, తనకు పిల్లనిచ్చిన మేనమామ షేక్ పీర్ ఆహమ్మద్ గారి అండదండలతో, చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నా తల్లి-తండ్రి అన్నీ తాన్కె నిలిచిన ఆయన తల్లి షేక్ బీబి జాన్ గారి శుభాశీస్సులతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ముస్లిం యోధుల చరిత్రను వెలికితీసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి దాదాపు రెండున్నర థాబ్దాలు అవుతుంది. అప్పటి నుండి తనెప్పుడూ విశ్రమించిందేలేదు. నిరంతరం చరిత్ర అన్వేషణలో నిత్యసంచారిగా మారి ఇప్పటి వరకు 25 పరిశోధనాత్మక గ్రంథాలను రాసి వెలువరించారు. ఆ గ్రంథాల ద్వారా తెలుగు ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు.

చరిత్ర రచనలోని హిప్రోక్రసీని దూరంగా నెట్టి ఎంతో నిర్భీతిగా తన హృదయాంతర్యాల నుండి ఎగిసిన నిప్పుల నాలుక ప్రస్తుతం ఆయన వెలువరించిన **'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు'** గ్రంథం. 1780లో ఆంధ్ర రాష్ట్రం, విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరంలో ఆరంభమైన తిరుగుబాటు నుండి 1947లో మాతృభూమికి స్వాతంత్ర్యం సిద్ధించేంత వరకు సాగిన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగస్వామ్యం అందించిన పలువురు స్వాతంత్ర్య సమరయోధుల కథనాన్ని పుస్తకం వివరంగా అందిస్తుంది. అనంతరం జాతీయోద్యమంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రంలోని పూర్వపు జిల్లాలోని పలు ప్రాంతాలలో సాగిన వివిధ ఉద్యమాలలో పాల్గొన్న వందలాది జాతీయోద్యమకారుల సంక్షిప్త సమాచారాన్ని రచయిత **'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు'**లో పొందుపర్చారు. ఈ విధంగా ఆంధ్ర ప్రాంతం ముస్లింల త్యాగాల చరిత్రను వీలయినంత విపులంగా చెప్పటం ద్వారా 'మన కోసం దేశం కాకుండా దేశం కోసం మనం' అను తీరులో నేటి ఆధునిక తరాన్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసే విస్తృత దూరదృష్టి రచయిత దృక్పథంలో వ్యక్తమౌతుంది. వాస్తవిక చరిత్రకు దృఢ పునాదులు వేస్తూ భావోద్వేగంతో గాక భారమ్మెన హృదయంతో రూపొందించిన పుస్తకమిది. మనలో అత్యధికులకు తెలియని ఎన్నో విషయాలు ఈ పుస్తకంలో మనకు దర్శనమిస్తాయి.

గొప్ప పాఠకుడు కానివాడు గొప్ప రచయిత కాలేడు. సయ్యద్ నశీర్ అహమ్మద్ భాయ్ గొప్ప రచయిత మాత్రమే కాదు గొప్ప పాఠకుడు. అతను తెలుగు, ఉర్దూ, ఆంగ్ల తదితర పలు భాషల్లో వెలువడిన వందలాది పుస్తకాలు చదివారు, చదివించుకున్నారు. ఆ గ్రంథాలలోని చారిత్రక సమాచారాన్ని సేకరించారు, విశ్లేషించుకున్నారు. ఎక్కడైనా తనకు అనుమానం వచ్చినా, అవసరం అన్పించినా ఆయా పాత్రల వంశజులను, కుంటుంబీకులను, సహచరులను, మిత్రులను ప్రత్యక్షంగా కలిసారు. ఆయన సందేహాలు పూర్తిగా నివృత్తి అయ్యాకే లభ్యమైన సమాచారాన్ని గ్రంథస్థం చేశారు. ఆ లక్ష్యంతో ఆయన దేశవ్యాప్తంగా పర్యటించారు. ప్రముఖ గ్రంథాలయాలను సందర్శించారు. ప్రసిద్ధి పొందిన చరిత్రకారులను, విద్యావేత్తలను, పరిశోధకుల్ని స్వయంగా కలిసారు, సంప్రదించారు, చర్చించారు. అనంతరం లభ్యమైన చారిత్రక సమాచారానికి అక్షరరూపం ఇచ్చారు.

ఆయనకెప్పుడూ కులమతాల తండ్లాట లేదు. ఆయన హిందూ-ముస్లిం సమైక్యతాభిలాషి, మత సామరస్యాన్ని, లౌకికతను బలంగా నమ్మిన వ్యక్తి. ఆ కారణంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో హిందూ-ముస్లింలు ఎలా భుజం భుజం కలిపి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారో తెలియజేయాలన్న తపనతో పలు పుస్తకాలు తెచ్చారు. కరుడుగడ్డున్న ఈ కాలం ఎత్తుపల్లాల్లో ఫాసిస్టు శక్తులు రోజురోజుకు బలం పుంజుకుంటూ సామాన్య ప్రజల్ని విడదీసే కుతంత్రాలు ఎక్కువ అవటంతో నశీర్ అహమ్మద్ రాసి వెలువరిస్తున్న పరిశోధనాత్మక చరిత్ర పుస్తకాల అవసరం ఏమిటో దేశం గుర్తించింది.

ఆ కారణంగా నశీర్ అహ్మద్ రాసిన పుస్తకాలు వివిధ భాషల్లో తర్జుమా అవుతున్నాయి. పలుమార్లు వేల సంఖ్యలో పునర్ముద్రణ పొందుతున్నాయి. పాఠకులకు కానుకలుగా అందుతున్నాయి. అది సామాన్య విషయం ఏమాత్రం కాదు. ఈ అనూహ్య క్రమం వెనుక ఆయన అకుంఠిత శ్రమ, సమాజం పట్ల, దేశం పట్ల ఆయనకున్న ప్రేమ ద్యోతకమవుతుంది. వ్యక్తి చైతన్యం నుండి సమిష్టి చ్కెతన్యం ఉద్భవిస్తుంది. ఈ పరిణామక్రమంలోనే వ్యక్తిత్వమూ వికాసం చెందుతుంది. ఒక నశీర్ అహమ్మద్ చైతన్యవంతుల్కెన కారణంగా ఇంత చరిత్ర లిఖించబడింది. ముస్లింలు సగర్వంగా తలెత్తుకునేలా ఆయన రాసిన ప్రతి పుస్తకం ఒక న్యాయవాదిలా జనం కోర్టులో వాదిస్తుంది. బ్రిటిష్ వారికి క్షమాపణ ఉత్తరాలు రాసుకుని విడుదల్కెన కూడా 'వీరుడు' అంటూ ఫాసిస్టు శక్తులు కొందరిని పొగుడుతున్నాయి. కానీ ఈ దేశం కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా ఆర్పించిన ముస్లింలను దేశద్రోహులుగా తెగుడుతున్నాయి. ఈ విపత్కర మలుపులో కదా! **'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు'** వంటి పుస్తకాలు కావాల్సింది ఇలాంటి సందర్భంలోనే కదా! ఈ చారిత్రక బాధ్యతను రచయిత నిర్విఘ్నంగా నెరవేర్చారు.


నశీర్ అహమ్మద్ తన పుస్తకాలను అంకితం ఇచ్చిన తీరును గమనిస్తే ఆయన వ్యక్తిత్వం, ఎంత స్థాయికి ఎదిగినా గతాన్ని మర్చిపోని ఆయనలోని నిష్కల్మషత్వం తెలుస్తుంది. పసితనంలో తనకు పాలు పట్టిన 'పాల తల్లి' గురిజాల యశోదమ్మకు **'అండమాను జ్కెలు : ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు'** పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. ఈ పుస్తకాన్ని తన చిన్నతనంలోనే పుస్తక పఠనం పట్ల అనురక్తి కలిగించిన తన పురిణి గ్రామం 'కూతుళ్ళు- కోడళ్ళకు' గౌరవపూర్వకంగా అంకితం ఇవ్వడమే కాకుండా వారెవరెరో తెలుపుతూ వారికి తనతోగల సాహిత్య బాంధవ్యాన్ని కూడా వివరించడం నిజంగా చాలా ఆర్ద్రత కలిగించే విషయం. నేటి వర్తమానంలో హిందూ-ముస్లింల మధ్య వైషమ్యాలు సృష్టించి తమ రాజకీయ పబ్బం గడుపుకోవాలని భావిస్తున్న శక్తులకు రచయిత నిజమైన భారతదేశం ఏమిటో! ఎలా ఉంటుందో నర్మ గర్భంగా చెప్పారు.

ఈ పుస్తకంలో పేర్కొన్న ముస్లిం యోధులు స్వాతంత్ర్యం సాధించేందుకు సోదర జనసమూ హాలతో కలపి సాగించిన పోరాటాన్ని స్ఫురణకు తీసుకరావడం ద్వారా సమాజాన్ని సుషుప్తావస్థ నుండి సుప్త చైతన్యం వ్కెపుకు మళ్ళించాలనే రచయిత ఆకాంక్ష బలంగా వ్యక్తమౌతుంది. సామాజికానుభూతిని వ్యక్తావ్యక్త స్థితిలోకి తెచ్చి మన చుట్టూ మనం గీసుకుంటున్న అనేకానేక సరిహద్దుల్ని చెరిపి నశీర్ అహమ్మద్ ఓ విశ్వమానవుడిగా నిలబడి సార్వకాలీనత, సార్వజనీనత సాధించడం ఆయన రచనలకు శాశ్వతత్వాన్ని ఇచ్చాయి.

ఆంధ్ర నేల నేలంతా తెల్లోడి రాక్షసపాలనకు వ్యతిరేకంగా కదం తొక్కింది. ఇందులో ఆంధ్ర ముస్లిం యోధులు సాగించిన సమరశీల పోరాటాలు నాటి ఆంధ్ర ముస్లింల చైతన్యాన్ని పట్టిస్తాయి. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే 1780లో విశాఖపట్నంలోని ఆంగ్లేయ సైనిక స్థావరంలో తిరుగుబాటు చేసి ఆంగ్లేయులను గడగడలాండించిన సుబేదార్ షేక్ అహమ్మద్, 1840 ప్రాంతంలో ఆంగ్లేయులతో యుద్ధానికి సిద్ధపడి అమరత్వం పొందిన కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్, 1841 ఉదయగిరి దుర్గం నుండి సమరశంఖారావం పూరించి అమరుడ్కెన ఉదయగిరి నవాబు సయ్యద్ అబ్బాస్ అలీ ఖాన్, 1857నాటి పోరాటంలో అంధత్వం ఏమాత్రం అడ్డుకాదంటూ ఆంగ్లేయుల మీద సాయుధ పోరుకు వ్యూహం పన్నిన షేక్ పీర్ షా, మన్యం తిరుగుబాటులో అల్లూరికి అండదండలు అందించిన ఆంగ్ల ప్రభుత్వ ఉన్నతాధికారి ఫజులుల్లా ఖాన్, తన ప్రసంగాల ద్వారా జాతీయోద్యమం దిశగా ప్రజలను మళ్ళించిన ధార్మికవేత్త డాక్టర్ ఉమర్ అలీ షా, 'విశాఖగాంధీ'గా గణుతికెక్కిన విశాఖయోధులు ఫరీద్దుల్ జమా, మహాత్ముని మార్గంలో సాగిన షేక్ గౌస్ సాహెబ్, టంగుటూరికి అండగా నిలచిన ముహమ్మద్ గౌస్ బేగ్, ప్రపంచ యుద్ధం సమయాన 'యుద్ధం వద్దు .. వద్దు' అంటూ బహిరంగంగా నినదించిన సయ్యద్ ముల్లా రాబియాబీ, సాంఘిక బహిష్కరణకు వెరవకుండా గాంధీజీ బాటన సాగిన హాజరా బీబి ఇస్మాయిల్, నిజాం రాజ్య పరగణాలో 'పరిటాల రిపబ్లిక్ పతాకం' ఎగరేసిన సాహసి మౌలా సాహెబ్, ఆంగ్ల స్కెన్యం మీద ఆయుధం ఎత్తిన ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు ఖాదర్ మోహిద్దీన్ లాంటి వేలాది మంది ఆంధ్ర ముస్లింలు భారత స్వాతంత్రోద్యమంలో పాల్గొని తమద్కెన భాగస్వామ్యాన్ని అందించిన వ్కెనం చదువుతుంటే ఒడలు జలదరిస్తాయి. ఈ కథనాలకు తోడుగా ఆంగ్లేయులను ఎదిరించి గెలిచిన సమరయోధుల పలు అరుద్కెన చిత్రాలను కూడా అందించడం **'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు'** గ్రంథానికి అదనపు ఆకర్షణయ్యింది

సుమారు మూడు థాబ్దాలుగా నశీర్ అహమ్మద్ సాగిస్తున్న కృషిని శ్లాఘిస్తూ దేశీయ-విదేశీయ పత్రికలలో ఆయన రచనల మీద వెలువడ్డ విశ్లేషణలు ఆయన విరామమెరుగక సాగిస్తున్న కృషిని, స్థాయిని మనకు తెలుపుతాయి. కువెట్ దేశంలోని ప్రవాసాంధ్రులు ఆయనను ఆహ్వానించి అక్కున చేర్చుకుని గౌరవించడం ద్వారా ఆయన రచనలు సరిహద్దులు దాటి ఎలా వ్యాప్తి చెందాయో అర్థమౌతుంది. ఆయన తన గ్రంథాలలో కాల్పనికతకు స్థానం ఇవ్వకుండా వాస్తవికతకు అద్దం పట్టడం ద్వారా నిజమైన చరిత్రకారునిగా నిలిచారు.

పర్వతమంత భావాన్ని ఉండంతగా చేసి చరిత్ర గోరుముద్దలు తినిపించే ఒక తల్లిలా సయ్యద్ నశీర్ అహమ్మద్ కలం ఈ పుస్తకంలో దర్శనమిస్తుంది. ఆనాటి కాలం నిర్మించిన కత్తుల వంతెనల్ని దాటి, చుట్టుముట్టిన సుడిగుండాల్ని దాటి, ఆవురావురంటున్న తెల్లోడి జ్కెలుగోడల్ని దాటి ఆంధ్ర ముస్లిం యోధులు సాగించిన మహోత్తర పోరాటాన్ని మన కళ్ళకు కట్టినట్టుగా రాసి, వెలువరించి మనముందుంచిన నశీర్ భాయ్‌కు వినమ్ర సలాములు. పురిణిలో పుట్టినా పుడమి నిండా వ్యాపించి దేదీప్యమానమైన కాగడాల్లా ఆయన అక్షరాలు వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాను. ఆంధ్ర ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు వృధాకావు. ఇది గతం మాత్రమే కాదు వర్తమానాన్ని రాజేసే అగ్నిశిఖ ఈ పుస్తకం.



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
బుధవారం
12 ఫిబ్రవరి 2025





# మూడు వాహనాలు 208 క్వింటాళ్లు

## సిర్పూర్(టీ) మండలంలో భారీగా రేషన్‌బియ్యం పట్టివేత

- రూ.7.48,800 విలువ గల బియ్యం స్వాధీనం
- యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు
- బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్పీ డీవీ శ్రీనివాస్ హెచ్చరిక

**ఉద్యమ కెరటం, సిర్పూర్(టీ):** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాస్ హెచ్చరించారు. సిర్పూర్ స్టేషన్ పరిధిలో మంగళవారం మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 208 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్టు చెప్పారు. స్థానిక ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఎస్సై కమలాకర్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి హుడికిలీ చెక్ పోస్ట్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేశారన్నారు. ఈ క్రమంలో ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో పీడీఎస్ బియ్యం ఉందని, వాటిని మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్ తన యజమాని మహమ్మద్ రజిక్ రహ్మాన్‌కు చెందినవని, వాటిని సరఫరాకు వెళ్తున్నానని డ్రైవర్ ఇషాక్ అహ్మద్ తెలిపాడు. మరొక సమాచారం మేరకు కిలోమీటర్ దూరంలో ఒక రెడ్ కలర్ మినీ వాహనం రాగా, ఆ వాహనాన్ని ఆపి డ్రైవర్ మహమ్మద్ కలీం సల్మాన్‌ను విచారించగా, అందులోనూ బియ్యం ఉందని తేలిందన్నారు. ఈ రెండు వాహనాలకు కాగజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ రజిక్ ఒకడే యజమాని అని తెలిసిందన్నారు. తర్వాత మధ్యాహ్నం ఇటికలపహడ్ గ్రామానికి వెళ్లే దారిలో గ్రౌండ్ వద్ద చెట్ల పొదలో ఒక్క మినీ మహీంద్రా వ్యాన్ ఉందన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా, అందులో కూడా రాయితీ పీడీఎస్‌బియ్యం ఉందన్నారు. అందులో ఉన్న వ్యక్తి తనదేనని, తానే డ్రైవరు, యజమాని అని ఒప్పుకున్నాడు. మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్‌కు సరఫరా చేస్తున్నామని చెప్పాడు. మొదటి రెండు వ్యానుల యజమాని మహమ్మద్ రజిక్ రెహమాన్, మూడో వాహనం యజమాని సయ్యద్ ఆరిఫ్‌ను విచారించగా, భీమిని మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన రాకేష్, అశోక్ దగ్గర బియ్యం కొన్నట్టు చెప్పాడు. పంచనామా అనంతరం కొన్ని బియ్యం బస్తాలు రేషన్ డీలర్ షాపులో నుంచి వచ్చినట్టుగా గుర్తించారు. కాగా, మొదటి వాహనం ఐచర్ వ్యాన్‌లో 108 క్వింటాళ్లు, రెండో మినీ ఐచర్ వ్యాన్‌లో 42 క్వింటాళ్లు, మూడో వాహనంలో 58 క్వింటాళ్లు మొత్తం మూడు వాహనాల్లో కలిపి 208 క్వింటాళ్ల బియ్యం ఉందని, దీని విలువ రూ.7.48,800 ఉంటుందని ఎస్పీ వివరించారు. సరఫరా చేస్తున్న యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అక్రమ కార్యాలపాలు నిర్వహించే వారిపై మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఈ అక్రమ బియ్యం పట్టుకున్న ఎస్సై కమలాకర్ తో పాటు విధులు నిర్వహించిన కానిస్టేబుళ్లు శశికాంత్, శరత్, సురేష్, పవన న్ను ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.

# ముందే అలర్ట్ చేసిన ఉద్యమ కెరటం




- సిర్పూర్ నియోజకవర్గం నుంచి అక్రమ వ్యాపారం పేరిట కథనం
- ఈ దారి గుండా నిఘా అవసరమని సూచన
- నేడు పోలీసులకు పట్టుబడ్డ భారీగా రేషన్ బియ్యం
- తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పెద్ద ఎత్తున తరలింపు

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ ప్రతినిధి: ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) నియోజకవర్గం హుడికిలి, గూడెం, వెంకట్రావ్‌పేట్ చెక్ పోస్టుల నుంచి భారీగా అక్రమ దందా కొనసాగుతున్నదని 'ఉద్యమ కెరటం' ఫిబ్రవరి 1న, 2న ప్రత్యేక కథనాలు ప్రచురించింది. వ్యాపారం సాగుతున్న తీరు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై సవివరంగా తెలిపింది. ఆసిఫాబాద్ నియోజకవర్గం గుండా జాతీయ రహదారి 363 వెళ్తున్నది. ఈ జాతీయ రహదారిపై వాంకిడి మండల కేంద్రంలో అంతర్ రాష్ట్ర రవాణా శాఖ, అటవీశాఖ, ఎక్సైజ్ శాఖ చెక్ పోస్ట్ లు ఉన్నాయి. ఈ చెక్ పోస్ట్ నుంచి కాకుండా, అక్రమ రవాణాదారులు, సిర్పూర్(టీ) నియోజకవర్గంలోనీ గూడెం, వెంకట్రావుపేట్, హుడికిలి , గుండా తెలంగాణలోకి ప్రవేశిస్తున్న విషయం తెలిపింది. వాంకిడి చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు సిబ్బంది కాపలా ఉండడం వలన, సిర్పూర్ నియోజక వర్గం నుంచి దొంగ వ్యాపారాలు చేసుకునేవారు ఈ రహదారుల గుండా గుట్కా, అక్రమ పశువుల రవాణా, పీడీఎస్?బియ్యం, దేశీదారు, గంజాయి సరఫరా నిరంతరం జరుగుతున్నది. సిర్పూర్(టీ) నియోజకవర్గం గుండా వచ్చే రహదారులపై రవాణా శాఖ, అటవీ శాఖ, పోలీస్ శాఖ, చెక్ పోస్టులు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నదని సూచించింది. సిర్పూర్ నియోజకవర్గంలో అక్రమ రవాణా జరుగుతున్నట్లు స్వయంగా సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాయాల్సిన పరిస్థితి నెలకొన్న విషయం వెలుగులోకి తెచ్చింది. అక్రమ వ్యాపారులకు సిర్పూర్(టీ) నియోజకవర్గంలోని రహదారులు పూర్తిస్థాయి-ంలో అనుకూలంగా ఉండి ఉపయోగపడుతున్నాయని, అక్రమ వ్యాపారుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాల్సిన సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం, అలసత్వం వల్ల వ్యాపారులకు ఈ రహదారులు వరంగా మారాయని చెప్పింది. అప్పుడప్పుడు ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పుడు అధికారులకు అక్రమ పశువుల రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుంటున్నారు. ఈ దారి గుండా నిత్యం వందలాదిగా బార్డర్ దాటివేతున్నాయని, చెక్ పోస్టులు లేకపోవడంతో ఇష్టారాజ్యం రవాణా సాగుతున్న విషయం తెలిపింది. ఇంత జోరుగా సాగుతున్న దొంగ వ్యాపారం గురించి అధికారులు నిర్లక్ష్యంగా ఉండటాన్ని కూడా ఉటంకింది. అక్రమ రవాణాపై సీఎం పేషీలో ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా, పట్టించుకోకపోవడంపై నిలదీసింది. అక్రమ రవాణా గురించి ఆసిఫాబాద్ డీటీవో రామచందర్ నాయక్ వివరణ కూడా జోడించింది. సిర్పూర్(టీ) నియోజకవర్గానికి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను నియమించినట్టు ఆయన వివరించారు. ప్రతినిత్యం తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. ఓవర్ లోడ్ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నామని 'ఉద్యమ కెరటం' దిన పత్రికకు చెప్పారు.



## రెండో రోజూ కథనం..

'అక్రమ వ్యాపారులకు అడ్డుకట్ట పడేనా?' ఫిబ్రవరి 2న కూడా ప్రత్యేక కథనం ప్రచురించింది. ఎమ్మెల్యే లేఖతోనైనా ప్రభుత్వం చర్యలు చేపట్టేనా..! మహారాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్ట్ ఏర్పాటు అయ్యేనా..! అంటూ వివరించింది. ఈ దారి గుండా నిఘా లేకపోవడంతో అక్రమార్కులు సాగిస్తున్న జీరో వ్యాపారం, నిషేధించిన వస్తువులు, మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యం తరలింపు సులభంగా మారిందని చెప్పింది. ఇరు రాష్ట్రాల వారి అవసరాల మేరకు అక్రమంగా జీరో వ్యాపారం, పన్నులు చెల్లించకుండా దిగుమతి చేసుకుంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న విషయాన్ని గుర్తు చేసింది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి గుట్కా, దేశీదారు, స్టీల్, ఐరన్, సిమెంట్, నాణ్యత లేని నిత్యవసర వస్తువులు పన్నులు చెల్లించని వాహనాలు , బస్సులతో పాటు పశువుల అక్రమ రవాణా ఈ మార్గాల నుండి సులభంగానే తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పింది. అధిక లోడ్లతో ప్రతినిత్యం అటు మహారాష్ట్ర నుంచి, ఇటు తెలంగాణ నుంచి వందల సంఖ్యలో వాహనాల ద్వారా ప్రతిరోజు రాకపోకలు జరుగుతున్న తీరును వివరించింది. ఇంత పెద్ద ఎత్తున అక్రమ వ్యాపారాలు జరుగుతున్న విషయం బహిరంగ రహస్యమే అని కూడా ఉటంకింది. సరిహద్దులో అంతర్రాష్ట్ర రవాణా చెక్ పోస్ట్ ఏర్పాటుతో అక్రమ వ్యాపారులకు అడ్డుకట్ట పడేనా..! ఎమ్మెల్యే ఫిర్యాదుల పైన చర్యలు ఉంటాయే-ంమో లేదో చూడాలి అని చెప్పింది. మంగళవారం కేవలం పోలీసుల తనిఖీలో గతంలో ఎన్నడూ లేనంతంగా మూడు వాహనాల్లో 208 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. అదే ఇతర శాఖల అధికారులు తనిఖీలు చేపడితే, ఇంకెన్ని కోట్ల అక్రమ వ్యాపారాలు బయటపడతాయో చూడాలి.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షణ రక్షిత
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
బుధవారం
12 ఫిబ్రవరి 2025


# భారీ రికార్డుకు చేరువలో రోహిత్..




## మరో 13 పరుగులు చేస్తే దిగ్గజాలను దాటేస్తాడు

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ భారీ రికార్డుకు చేరువలో ఉన్నా డు. అతను మరో 13 పరుగులు చేస్తే వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. సచిన్, రికీ పాంటింగ్, సౌరభ్ గంగూలీ, జాక్వెస్ కలిస్ వంటి దిగ్గజాల కంటే వేగంగా 11 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడి గా హిట్‌మ్యాన్ నిలుస్తాడు. ఈ అరుదైన జాబితాలో విరాట్ కోహ్లి అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లి 222 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధిం చాడు. ఇప్పటివరకు రోహిత్ 259 ఇన్నింగ్స్‌ల్లో 10,987 రన్స్ చే శాడు. ఇంగ్లాండ్‌తో బుధవారం జరిగే మూడో వన్డేలో రోహిత్ ఈ భారీ రికార్డును సాధించే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో రోహిత్ (119బీ 90 బంతుల్లో) శతకం బాది ఫామ్ లోకి వచ్చిన సంగతి తెలిసిందే. హిట్‌మ్యాన్‌కిది వన్డేల్లో 32వ సెంచ రీ కాగా.. అంతర్జాతీయ క్రికెట్‌లో 49వ శతకం. మరో సెంచరీ చేస్తే సచిన్ తెందూల్కర్ (100), విరాట్ కోహ్లి (81) తర్వా త 50 సెంచరీలు చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డుల్లోకెక్కుతాడు.

### అంత తేలిక కాలేదు

రెండో వన్డేలో సూపర్ సెంచరీతో కెప్టెన్ రోహిత్ పేలవ ఫామ్ నుంచి బయటకి రావడం ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌కు శుభసూచకమే. అయితే తిరిగి పరుగుల బాట పట్టే ప్రక్రియ చాలా కష్టమైందని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఆదివారం ఇంగ్లాండ్‌పై 90 బంతుల్లోనే 119 పరుగులు చేసిన అతడు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. "చాలా కాలంగా క్రికెట్ ఆడుతున్నా. నేనేం చేయాలో నాకు తెలుసు. ఈ రోజు అదే చేశా" అని రెండో వన్డే అనంతరం రోహిత్ చెప్పాడు. రెండో వన్డేలో రోహిత్ చేసిన శతకం.. 2023 అక్టోబరు తర్వాత అతడు సాధించిన తొలి వన్డే సెంచరీ. ఈ కాలంలో అతడు 13 మ్యాచ్‌ల్లో అయిదు అర్ధశతకాలు సాధించాడు. "నా శైలిలో బ్యాటింగ్ చేశా. చాలా కాలంగా ఆడుతున్నా. ఒకటి రెండు ఇన్నింగ్స్‌లు నా బ్యాటింగ్ తీరును మార్చవు. ఈ రోజు నాకు అన్ని రోజుల లాంటిదే" అని రోహిత్ చెప్పాడు. పరుగులు చేయడానికి ఏం చేయాలో తెలిసినా, ఫామ్‌ను అందుకోవడం అంత తేలిక కాలేదని అన్నాడు. 'కెరీర్‌లో ఎన్నో పరుగులు చేశా. ఎలా పరుగులు రాబట్టాలో తెలుసు. కానీ అదంత తేలిక కాలేదు. చాలా కష్టంగా మారింది. కానీ నేను ఆటను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టా" అని రోహిత్ పేర్కొన్నాడు. "మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ బాగా ఆడాలనుకుంటా. కొన్నిసార్లు బాగా ఆడొచ్చు.. కొన్నిసార్లు ఆడకపోవచ్చు. ఏం చేయాలనే విషయంలో స్పష్టత ఉన్నప్పుడు.. మిగతా విషయాలేమీ పట్టించుకోవాల్సిన అవసరం లేదు" అని చెప్పాడు.



# క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత్..

## తుది జట్టులో 4 మార్పులు!


ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1 కైవసం చేసుకున్న టీమ్ఇండియా.. మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంపై కన్నేసింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న భారత జట్టు.. మూడో వన్డేలోనూ విజయం సాధించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాలని భావిస్తోంది. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం టీమ్ఇండియా తుది జట్టులో పలు మార్పులు చేసి బెంచ్ బలాన్ని పరీక్షించాలనుకుంటోంది. సిరీస్‌లో ఇప్పటివరకు ఆడని వికెట్‌కీపర్ రిషభ్ పంత్, ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. తొలి వన్డేలో ఆడిన మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అహ్మదాబాద్‌లో ఆడే అవకాశాలున్నాయి. వికెట్‌కీపర్ కేఎల్ రాహుల్ స్థానాన్ని పంత్, షమి ప్లేస్‌ని అర్ష్‌దీప్ భర్తీ చేసే ఛాన్స్ ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో రాణించిన అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాకు విశ్రాంతి ఇచ్చి వారి స్థానంలో కుల్‌దీప్, సుందర్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. నాగ్‌పుర్‌లో జరిగిన మ్యాచ్‌తో వన్డేల్లోకి అరంగేట్రం చేసిన యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ మూడో వన్డేలో బెంచ్‌కే పరిమితమయ్యే ఛాన్స్ ఉంది. స్టార్ బ్యాటర్, కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావడం భారత్‌కు కలిసొచ్చే అంశం. విరాట్ కోహ్లి కూడా అహ్మదాబాద్ వన్డేతో ఫామ్ అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. నరేంద్రమోదీ స్టేడియంలో భారత్ చివరి వన్డే మ్యాచ్ నవంబర్ 19, 2023న ఆడింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలై మూడోసారి విశ్వవిజేతగా నిలిచే అవకాశాన్ని చేజార్చుకుంది.

**భారత్ తుది జట్టు (అంచనా)**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

# ఛాంపియన్స్ ట్రోఫీ.. బుమ్రా ఔట్?

## ఆ ఇద్దరికీ చోటు!



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సమరం ఆరంభానికి మరికొన్ని రోజులే మిగిలిఉంది. ఎనిమిది జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీ మరో వారం రోజుల్లో మొదలవనుంది. ఇప్పటికే అన్ని దేశాలు జట్లను ప్రకటించాయి. జట్టులో మార్పులు, చేర్పులకు మంగళ వారంతో గడువు ముగియనుంది. వెన్నునొప్పి కారణంగా ఆటకు దూరంగా ఉన్న భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో ఉంటాడా? లేదా అనే దానిపై బీసీసీఐ నేడు (మంగళవారం) నిర్ణయం తీసుకోనుంది.

### బుమ్రాను తప్పిస్తే..

ఆస్ట్రేలియా పర్యటన చివర్లో వెన్నునొప్పితో ఇబ్బందిపడిన బుమ్రా.. అప్పట్నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. అహ్మదా బాద్‌లో ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో బుమ్రా ఆడి ఫిట్‌నెస్‌ను చాటుకొనే ప్రయత్నం చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ, బుమ్రా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి పరిమితమవడంతో అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు నెలకొన్నా యి. ఒకవేళ బుమ్రాను తప్పిస్తే అతని స్థానంలో ఇటీవల ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన యువపేసర్ హర్షిత్ రాణా ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి వన్డేలో హర్షిత్ ఆకట్టుకున్నాడు. ఏడు ఓవర్లు బౌలింగ్ చేసి 53 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఒక ఓవర్ మెయిడిన్. కటక్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో హర్షిత్ 9 ఓవర్లు వేసి 62 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ఏదేమైనా బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైతే భారత్‌కు అది గట్టి దెబ్బే.

### వరుణ్‌కు ఛాన్స్ దక్కితే బయటికి వెళ్లేదెవరు?

ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో అరంగేట్రం చేసిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసే అవకాశాలున్నాయి. అతను ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అదరగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. వరుణ్ తన తొలి వన్డేలో 10 ఓవర్లు వేసి 54 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. చక్రవర్తిని జట్టులోకి తీసుకుంటే కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లలో ఒకరిని పక్కనపెట్టాలి. అయితే, కుల్‌దీప్ జట్టులో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే జట్టులో ఉన్న ఏకైక మణికట్టు స్పిన్నర్ అతనే. ఫిబ్రవరి 11 తర్వాత కూడా ఐసీసీ సాంకేతిక కమిటీ అనుమతితో జట్టులో మార్పులు చేసుకోవడానికి వీలుంది. దీంతో సెలక్టర్లు బుమ్రా, వాషింగ్టన్ సుందర్‌లను ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ఎంపిక చేసే అవకాశాలు లేకపోలేదు.

# సైబర్ నేరగాళ్లకు రివర్స్ పంచ్..

## అలా తప్పించుకున్నా: సంజయ్ మంజ్రేకర్



ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ ద్వారా తెలిసినవారిలా నటిస్తూ అవతలి వారి నుంచి అధిక మొత్తంలో సొమ్ము లాగుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని జాగ్రత్తలు చెబుతున్నా కొందరు మాత్రం కేటుగాళ్ల వలలో చిక్కుతున్నారు. భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వీరి బారి నుంచి చాలా తెలివిగా తప్పించుకున్నారట. తన అనుభవాన్ని ఆయన 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వివరించారు. "పరిచయమున్న ఒక వ్యక్తి రూ.25 వేలు అవసరమున్నాయంటూ వాట్సప్‌లో మెసేజ్ చేశారు. అయితే.. అతడి ఫోన్ హ్యాక్ అయిన విషయం నాకు ముందే తెలిసింది. ఇదంతా సైబర్ నేరగాళ్ల పనేనని అర్థమైంది. దీంతో పేమెంట్ ఎలా చేయాలి అని అడిగా. అప్పుడు అతడు గూగుల్‌పే చేయమంటూ ఒక నంబర్ పంపించాడు. డబ్బు పంపాక అందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్ కూడా తనకు పంపాలని కోరాడు. అయితే.. రూ. 25 వేలు కాకుండా రూ. 25 లక్షలు పంపమంటారా..?" అని మంజ్రేకర్ రివర్స్ పంచ్ ఇచ్చారు. అలా అనేసరికి అవతలి వ్యక్తి నుంచి మెసేజ్‌లు ఆగిపోయాయని తెలిపారు. మంజ్రేకర్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'చాలా తెలివిగా పంచ్ ఇచ్చారు సర్' అంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. 2024 సర్వే ప్రకారం.. గత మూడేళ్లలో దేశంలోని సగం మంది ఆర్థిక మోసాలకు బలయ్యారు. 47 శాతం మంది ప్రజలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువసార్లు సైబర్ మోసాల బారిన పడ్డారు. ఎక్కువగా యూపీఐ, క్రెడిట్ ద్వారా మోసాలు జరిగినట్లు తెలిసింది. ఈ మోసాలపై అత్యంత జాగ్రత్తగా ఉండాలంటూ సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



# ఎయిర్‌పోర్ట్‌లో మహిళకు హగ్ ఇచ్చిన కోహ్లి

## ఆ లక్కీ లేడీ ఎవరంటూ కామెంట్స్

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇటీవల బ్యాటింగ్‌లో అతను చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయకపోయినా కింగ్‌కు ఆదరణ తగ్గడం లేదు. కోహ్లిని చూడటానికి అభిమానులు స్టేడియానికి పోటెత్తుతున్నారు. ఇటీవల కోహ్లి రంజీ ట్రోఫీలో ఆడగా ఆ మ్యాచ్‌ను వీక్షించడానికి అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కటక్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేకు ముందు రోజు విరాట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్న సమయంలోనూ స్టేడియానికి ఫ్యాన్స్ పోటెత్తారు. ఇక కోహ్లి బయట కనిపిస్తే అతడితో షేక్ హ్యాండ్ ఇవ్వటానికి అభిమానులు పోటీపడుతుంటారు. అయితే, తాజాగా కోహ్లి స్వయంగా ఓ మహిళ దగ్గరకు వెళ్లి హగ్ ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇంగ్లాండ్‌తో మూడో వన్డే కోసం భారత జట్టు అహ్మదాబాద్ బయలుదేరడానికి భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సమయంలో ఇది ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విమానాశ్రయంలో చెకింగ్ ఏరియాకి ముందు కొంతమంది ఫ్యాన్స్ క్రికెటర్లను చూడటానికి నిలబడ్డారు. కోహ్లి అటువైపు వస్తూ ఆ గుంపులో ఓ మహిళని చూశాడు. నవ్వుతూ ఆమె దగ్గరికి వెళ్లి హగ్ ఇచ్చి మాట్లాడాడు. అక్కడ ఉన్న మిగిలినవారు కోహ్లితో షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో భద్రతా సిబ్బంది కలగజేసుకొని కోహ్లిని అక్కడినుంచి పంపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విరాట్ నుంచి హగ్ అందుకున్న ఆ లక్కీ లేడీ ఎవరు?, ఆమెను కోహ్లి ఎందుకు హగ్ చేసుకున్నాడు? అని ఫ్యాన్స్ నెట్టింట కామెంట్లు చేస్తున్నారు. అయితే, సదరు మహిళ కోహ్లికి దగ్గరి బంధువు అని తెలుస్తోంది. అందుకే దగ్గరికి వెళ్లి హగ్ ఇచ్చాడని సమాచారం.



# గంభీర్.. ఇది సరైన పద్ధతేనా..?

## తప్పుబట్టిన మాజీ క్రికెటర్

ఇంగ్లండ్‌ను టీ20ల్లో మట్టికరిపించిన టీమ్ఇండియా.. వన్డేల్లోనూ మరో మ్యాచ్ మిగిలిఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. వరుస విజయాలతో ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ.. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌పై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా వికెట్ కీపర్, బ్యాటర్ కేఎల్ రాహుల్ స్థానంపైనే ఈ చర్చంతా. అతడిని బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందికి పంపడంపై పలువురు మాజీలు కోచ్ గౌతం గంభీర్‌ను ప్రశ్నిస్తున్నారు. మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మరో అడుగు ముందుకువేసి ఇది సరైన పద్ధతి కాదంటూ గంభీర్‌పై మండిపడ్డాడు. రిషభ్ పంత్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం.. కేఎల్ బ్యాటింగ్ ఆర్డర్‌పై క్రిష్ స్పందించాడు. "శ్రేయస్ అయ్యర్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇది టీమ్ఇండియాకు సానుకూ లాంశం. అయితే.. కేఎల్ రాహుల్ విషయంలో జరుగుతున్నది దురదృ ష్టకరం. అతడి విషయంలో వ్యవహరిస్తున్న తీరు న్యాయంగా లేదు. అతడి రికార్డులు చూడండి. నంబర్ 5వ స్థానంలో గొప్పగా రాణించాడు. టీమ్ మేనేజ్‌మెంట్ ఏం ఆలోచిస్తుందో తెలియడం లేదు. అతడిని 6, 7 స్థానాల్లో పంపిస్తే 6, 7 పరుగులే చేస్తాడు" అని క్రిష్ తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. ఈ విషయంలో గంభీర్ తీరుపై విమర్శలు గుప్పించాడు. కేఎల్ రాహుల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను ప్రమోట్ చేయ డంపైనా ప్రశ్నించాడు. "గంభీర్.. నువ్వు చేస్తోంది సరైంది కాదు. పరిస తులను బట్టి అక్షర్‌ను నంబర్ 5వ స్థానంలో పంపొచ్చు. కానీ అది స్థిరమైన వ్యూహం కాకూడదు. ఇలాంటి మార్పులు కొనసాగిస్తే.. కీలకమైన మ్యాచ్‌లో పరిస్థితి ఏంటి..? మీరు చెబుతున్న లెఫ్ట్-రైట్ కాంబినేషన్ ద్వారా దీన్ని సమర్థించుకోలేరు. ఇదే విధానాన్ని టాప్-4 విషయంలో ఎందుకు పాటించరు..? నంబర్ 5 విషయంలోనే ఇది ఎందుకు..?అక్షర్ పటేల్ విషయంలో నాకెలాంటి ఇబ్బంది లేదు. అతడు తన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాడు. రాహుల్‌ను కిందికి పంపితే అతడి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ప్రపంచ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాడి విషయంలో ఇది న్యాయమేనా?" అని గంభీర్‌పై ప్రశ్నల వర్షం కురిపించాడు. ఇక రిషభ్ పంత్‌ను పక్కన పెట్టడం కూడా సరైంది కాదని క్రిష్ అన్నాడు. మూడో వన్డేలో అతడిని తుది జట్టులోకి తీసుకోవాలని.. ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడించాలని సూచించాడు. ఇప్పటికే సిరీస్ గెలిచిన నేపథ్యంలో.. అహ్మదాబాద్‌లో జరిగే మూడో వన్డేలో టీమ్ఇండియా భారీ మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆడే చివరి వన్డే కావడంతో.. ఇప్పటివరకూ ఛాన్స్ రానివారిని తుది జట్టులో ఆడించనున్నట్లు తెలుస్తోంది.

### ఛాంపియన్స్ ట్రోఫీ..

# ఆ రెండు జట్లే టైటిల్ ఫేవరెట్లు

**ముత్తయ్య మురళీధరన్**



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సమరం మరో వారం రోజుల్లో మొదలవనుంది. ఈ మెగా టోర్నీలో భారత్, పాకిస్థాన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, అఫ్గానిస్థా న్, బంగ్లాదేశ్ జట్లు పాల్గొననున్నాయి. భారత్ ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో మిగతా మ్యాచ్‌లన్నీ పాక్‌లో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. 29 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తుండటం విశేషం. టోర్నీ ఆరంభానికి మరికొన్ని రోజులే మిగిలి ఉండటంతో ఏఏ జట్లు సెమీస్‌కు చేరతాయి, ఏ జట్టు విజేతగా నిలిచే అవకాశముందనే దానిపై మాజీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. భీకరమైన పేస్ దాడి కలిగిన పాక్ సెమీఫైనల్ చేరుకుంటుందని భారత మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఇప్పటికే అంచనా వేశారు. తాజాగా శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ ముత్త య్య మురళీధరన్ భారత్, పాకిస్థాన్‌లను టైటిల్ ఫేవరెట్లుగా ఎంచుకున్నాడు. 'టోర్నీలో భారత్, పాకిస్థాన్ టైటిల్ ఫేవరెట్లు. కానీ, కచ్చితంగా ఈ జట్టే ఛాంపియన్‌గా నిలు స్తుందని నమ్మకంగా చెప్పలేం. టోర్నీలో స్పిన్ బౌలింగ్ అనేది కీలకం. పాక్ పిచ్‌లు స్పిన్నర్లకు సహకరిస్తాయి. యూఏఈ పిచ్‌లు కూడా స్పిన్ బౌలింగ్‌కు అనుకూలిస్తాయి. ఈ టోర్నీ లో స్పిన్నర్లు ఎక్కువ ప్రభావం చూపిస్తారు. భారత జట్టులో నలుగురు స్పిన్నర్లున్నారు. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ స్పిన్ ఎటాక్ బలంగా ఉంది. టీమ్ఇండియా, పాకిస్థాన్ జట్లు స్పిన్‌తోపాటు పేస్ బౌలింగ్‌లో పటిష్టంగా ఉన్నాయి' అని మురళీధరన్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లి పేలవఫామ్‌తో ఇబ్బందిపడుతుండగా.. రోహిత్ శర్మ ఇంగ్లాండ్‌పై సెంచరీ చేసి ఫామ్‌లోకి వచ్చాడు. ఈ అంశంపై మురళీధరన్ మాట్లా డాడు. 'ఇద్దరు అసాధారణ ఆటగాళ్లు. వరల్డ్ క్లాస్ బ్యాటర్లు. ఫామ్ అనేది తాత్కాలికం. క్లాస్ అనేది శాశ్వతమని నేనెప్పు డూ చెబుతుంటా. రోహిత్ సెంచరీ చేశాడు. విరాట్ కూడా ఫామ్‌లోకి వస్తాడు. ఈ ఇద్దరు రాణిస్తే టోర్నీలో భారత్ ఛాం పియన్స్ ట్రోఫీని సాధిస్తుంది' అని మురళీధరన్ వివరించాడు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com





# ఆర్టీసీ బస్సులో 'తండేల్'

## విచారణకు ఆదేశించిన సంస్థ ఛైర్మన్

నాగచైతన్య, సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్'. ఈ సినిమా విడుదలైన నాటి నుంచి దీన్ని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం రిలీజ్ అయిన రెండు రోజుల్లోనే ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో దీన్ని ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. నిర్మాత బన్నివాసు స్పందిస్తూ ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తాజాగా దీనిపై విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై ఎంక్వైరీ చేసి పూర్తి వివరాలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'తండేల్' పైరసీ సినీ ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీని గురించి ఆ సినిమా నిర్మాతలు అల్లు అరవింద్, బన్నివాసు ప్రెస్‌మీట్ నిర్వహించారు. పైరసీని ప్రోత్సహిస్తోన్న వారిపై మండిపడ్డారు. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఆ పైరసీ ప్రింట్ ప్రదర్శించడం దారుణమని.. చిత్ర విజయాన్ని ఆస్వాదించే సమయంలో ఇదొక ప్రతిబంధకం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఇలా సినిమాల్ని పైరసీ చేస్తున్నారని.. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్స్‌లో ఆ లింక్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని అన్నారు. అలా పైరసీ చేస్తున్న వారిని, దాన్ని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతున్నామని.. వాళ్లంతా జైలుకు వెళ్లే అవకాశముందని హెచ్చరించారు.



# విజయ్ దేవరకొండ కోసం రణ్‌బీర్, ఎన్టీఆర్, సూర్య వాయిస్



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్). ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర బృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. దీని టైటిల్ టీజర్ ఫిబ్రవరి 12న రిలీజ్ కానున్నట్లు తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రానున్న విషయం తెలిసిందే. దీని హిందీ వెర్షన్‌కు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారు. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను పంచుకుంది. 'యానిమల్' హీరో వాయిస్‌తో ఈ చిత్రం మరింత వైల్డ్‌గా మారనుందని.. ప్రేక్షకులకు కావాల్సిన ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుందని పేర్కొంది. తమిళ టీజర్‌కు స్టార్ హీరో సూర్య వాయిస్ అందించనున్నట్లు మూవీ టీమ్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు, ఎన్టీఆర్ వాయిస్‌తో తెలుగు టీజర్ రానుంది. తాజాగా ఈ వివరాలు ప్రకటిస్తూ చిత్ర బృందం ఫొటో పంచుకుంది. "నిన్న చాలాసేపు ఎన్టీఆర్ అన్నతోనే ఉన్నా. వ్యక్తిగత జీవితం, సినిమా తదితర అంశాల గురించి మాట్లాడుకున్నాం" అని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు ఎన్టీఆర్‌కు థాంక్స్ చెప్పారు. ఇందులో విజయ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. మళ్లీ రౌడీ హీరో విజయ్ దేవరకొండను పవర్‌ఫుల్‌గా చూడనున్నారని నిర్మాత ఓ సందర్భంలో అన్నారు. మార్చి 28న ఈ సినిమా విడుదల కానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రానున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. 'విధి పిలిచింది.. రక్తపాతం ఎదురుచూస్తోంది.. కొత్త రాజు ఉద్భవిస్తాడు' అంటూ టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తి పెంచిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# పదేళ్ల తర్వాత మళ్లీ?

సినిమాల్లో తన నటనతో మెప్పిస్తూనే.. మరోవైపు గాయకురాలిగా ప్రేక్షకుల్ని అలరిస్తుంది అందాల తార శ్రుతి హాసన్. ఇప్పుడామె మరో కొత్త ప్రాజెక్టును తన జాబితాలో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. తమిళ అగ్రకథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జన నాయగన్'. హెచ్.వినోద్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో శ్రుతి హాసన్ ఓ కీలక పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చర్చలు పూర్తయినట్లు సమాచారం. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో మమితా బైజు, వరలక్ష్మీ శరత్‌కుమార్, రెబా మోనికా జాన్ తదితరులు నటిస్తున్నారు. మరి 2015లో 'పులి' అనే సినిమా కోసం జంటగా మెరిసిన విజయ్, శ్రుతి.. మళ్లీ దశాబ్దం తర్వాత తెరపై ఎలాంటి హంగామా చేయనున్నారో తెలుసుకోవాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడాల్సిందే.



# డ్రగ్స్ కేసు.. నిర్దోషిగా తేలిన 'దసరా' విలన్

సినీ నటుడు షైన్ టామ్ చాకో సహా మరో ఆరుగురిని నిర్దోషిగా తేలుస్తూ మంగళవారం కేరళ కోర్టు తీర్పు వెలువరించింది. 2015లో ఓ ఫ్లాట్‌లో కొకైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు దానికి సంబంధించిన కేసులో చాకో సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన సినిమాల్లో నటిస్తున్నారు. మరోవైపు కోర్టులో కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. ఎర్నాకుళం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఈ రోజు విచారణ జరగ్గా, కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సులేఖ.. నటుడు చాకో సహా ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించారు. ఇందులో నలుగురు మహిళలు ఉండటం గమనార్హం. వీరితో పాటు ఓ నైజీరియన్, తమిళనాడుకు చెందిన పృథ్వీరాజ్ అనే వ్యక్తి కూడా ఉన్నారు. నాని కథానాయకుడిగా నటించిన 'దసరా'లో చిన్ననంబిగా తనదైన విలనిజాన్ని పండించిన చాకో ఆ తర్వాత తమిళ, మలయాళ చిత్రాల్లో ఎక్కువగా పాత్రలు దక్కించుకున్నారు. గతేడాది విడుదలైన 'దేవర'లోనూ కీలక పాత్ర పోషించారు. ఇక ఈ ఏడాది వచ్చిన 'డాకు మహారాజ్'లో ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్‌గా నటించారు. వీటితో పాటు, మోహన్‌లాల్ 'లూసిఫర్2', 'చత్తులి', 'బజూకా', 'ఆరామ్ తిరుకల్పన్' 'వెల్లప్పమ్', 'పారడైజ్ సర్కస్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు.

# సూర్యతో నటించడం గర్వంగా ఉంది : పూజా హెగ్డే



హీరో సూర్య నటించే 69వ చిత్రంలో తాను కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉందని ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న 'రెట్రో' మూవీ చిత్రీకరణ పూర్తి చేసి మే ఒకటో తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇందులో తనకు దక్కిన అవకాశంపై పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు నేను నటించిన చిత్రాలన్నీ నన్ను గర్వపడేలా చేశాయి. కానీ, 'రెట్రో' మాత్రం నేను గర్వించే చిత్రంగా ఉంటుంది. ఇందులోని ప్రతి సన్నివేశం నాకు చాలా ఇష్టం. షూటింగు సమయంలో పొందిన అనుభూతి ఎన్నటికీ మరిచిపోలేనిది. సినిమా ఇంకా చూడకుండానే గట్టి నమ్మకంతో చెబుతున్నాను. ప్రస్తుతం 'రెట్రో' మూవీ ఎడిటింగ్ జరుగతోంది. త్వరలోనే మేకర్స్ ఆడియో, ట్రైలర్ రిలీజ్ తేదీలు వెల్లడిస్తారు' అని వివరించారు. ప్రస్తుతం తమిళంలో విజయ్ తో 'జన నాయగన్', 'కాంచన 4' చిత్రాలతో బిజీ గా ఉన్నారు.



# అనుకున్న తేదీకే 'ఇడ్లీ కడై'

ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). ఈ సినిమా ఏప్రిల్ 10 నుంచి వాయిదా పడినట్లు ఇటీవల రూమర్స్ వచ్చాయి. తాజాగా వాటిని చిత్ర బృందం ఖండించింది. అనుకున్న సమయానికే ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ అవుతుందని స్పష్టం చేసింది. 'జాబిలమ్మ నీకు అంత కోపమా' ట్రైలర్ విడుదల వేడుకలో ఈ వాయిదా రూమర్లను మేకర్స్ ఖండించారు. ఇందులో ధనుష్ సరసన నిత్యామేనన్ నటించారు. ధనుష్‌పై రష్మిక ప్రశంసలు కురిపించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన కొత్త చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ ప్రధాన పాత్రలు పోషించారు. ధనుష్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఫిబ్రవరి 21న తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ తనకెంతో నచ్చిందంటూ రష్మిక పోస్ట్ పెట్టారు. "ధనుష్ సర్.. నటుడు, దర్శకుడు, రైటర్, సింగర్, డ్యాన్సర్, మ్యూజిక్ కంపోజర్.. ఇలా ఏ పనిలోనైనా మీరు బెస్ట్ ఇస్తారు. 'జాబిలమ్మ నీకు అంత కోపమా' ట్రైలర్ అందరినీ నవ్విస్తుంది. మీ గ్యాంగ్ నాకెంతో నచ్చింది" అంటూ ఈ చిత్ర బృందాన్ని అభినందించారు. ధనుష్ హీరోగా రూపొందుతున్న 'కుబేర'లో రష్మిక నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్ మునుపెన్నడూ చేయని కొత్త పాత్రలో కనిపించనున్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున కీలక పాత్ర పోషించారు.



# ఆ హీరో కోసం భారీ సినిమాను రిజక్ట్ చేసిన అనన్యపాండే

బాలీవుడ్ బ్యూటీ " అనన్య పాండే " గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రముఖ బాలీవుడ్ నటుడు చుంకి పాండే కుమార్తెగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ.. 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2' ఫిల్మ్‌తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఈమె.. తెలుగులో కూడా ఒక సినిమాలో నటించింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లైగర్ సినిమాతో పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ అంచనాలతో రిలీజ్ అయినప్పటికీ డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. దాంతో తెలుగులో మళ్లీ మరో సినిమాకు ఓకే చెప్పలేదు. రీసెంట్ గానే లైగర్ సినిమాను అనన్య అయిష్టంగానే ఒప్పుకుందని చుంకీ పాండే చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో అనన్య పాండేకి సంబంధించి ఓ వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు హీరోయిన్స్. ఇక పలువురు హీరోయిన్లు అయితే కొంతమంది స్టార్ హీరోలు, దర్శకుల సినిమాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు. కానీ కొన్ని సార్లు డేట్స్ అడ్జెస్ట్ అవ్వక ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకుంటారు. ఇప్పుడు అనన్య పాండే డైరెక్టర్ ఇంతియాజ్ అలీ తెరకెక్కిస్తున్న సినిమాలో ఆఫర్ వచ్చిందట. బాలీవుడ్ లో ఇంతియాజ్ అలీ ప్రేమకథలు తెరకెక్కించడంలో మంచి పేరుంది. ఇంతియాజ్ ఓ భారీ బడ్జెట్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఆ సినిమాలో హీరోయిన్ గా అనన్యను అనుకున్నారట. అయితే కార్తీక్ ఆర్యన్ సినిమా షూటింగ్ లో ఆమె బిజీగా ఉండటంతో డేట్స్ అడ్జెస్ట్ కాక ఇంతియాజ్ అలీ సినిమాను రిజెక్ట్ చేసిందట.



# హీరో కోసం కోట్ల ఆస్తిని రాసిచ్చింది..

హీరో అభిమాని ఏకంగా కొన్ని కోట్ల విలువైన తన ఆస్తిని స్టార్ హీరో పేరు మీద రాసిచ్చి చనిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. సదురు హీరో చలించిపోయాడు. ఇంతకు ఏం జరిగిందంటే.. ముంబైకు చెందిన నిషా పాటిల్ కు నటుడు సంజయ్ దత్ అంటే పిచ్చి అభిమానం. చిన్నప్పటి నుంచి ఆయన్ను ఆరాధిస్తూ పెరిగింది. నామ్ నుంచి ఖల్ నాయక్ దాకా, సంజు నుంచి కెజిఎఫ్ 2 దాకా ప్రతి చిత్రాన్ని కొన్ని వందల సార్లు చూసింది. లెక్కలేనంత డబ్బు టికెట్లకే పెట్టింది. అయితే ఇటీవల నిషా పాటిల్ కన్నుమూసింది. ఆమె వయసు 62 సంవత్సరాలు. కన్నుమూసే నాటికి సుమారు 72 కోట్ల రూపాయల ఆస్తి నిషా పేరిట ఉంది. కాగా, అదంతా సంజయ్ దత్‌కు రాసేసి వెళ్లిపోవడం కుటుంబ సభ్యులను షాక్ కు గురి చేసింది. తన చివరి రోజులను ముందే గుర్తించిన నిషా పాటిల్ ఆస్తి డాక్యుమెంట్లను 2018లోనే లీగల్ గా రాయించి, బ్యాంకు అకౌంట్లలో ఉన్న డబ్బుని సంజయ్ దత్ కి అందజేయాలని లెటర్లు రాసి పక్కాగా బదలాయింపు చేసింది. ఇదంతా ఇంటికి దస్తావేజులు వచ్చాక కానీ.. సంజు బాబాకు మేటర్ అర్థం కాలేదు. అసలు పరిచయమే లేని ఒక అపరిచితురాలు ఆస్తి రాసివ్వడం చూసి నివ్వెరపోయాడు. విషాదం ఏంటంటే నిషా పాటిల్ ఇప్పటిదాకా సంజయ్ దత్ ని ప్రత్యక్షంగా కలవలేదు. కానీ.. తన హీరో మీద ప్రేమ తో కోట్ల రూపాయలు కానుకగా ఇచ్చింది. సంజయ్ దత్ వాటిని స్వీకరించలేదు. త్వరలోనే వాళ్ళ ఫ్యామిలీకే అవి తిరిగి చెందేలా తన లీగల్ టీమ్‌ని పురమాయించారు. ఇంత వీరాభిమానిని కలుసుకోలేకపోవడం కలవపరిచిందని, కనీసం కుటుంబ సభ్యులనైనా కలిసి కొంత ఊరట చెందుతానని సంజయ్ దత్ పేర్కొన్నారు.